
సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
మంగళవారం, 10.03.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 138
పేజీలు: 12 వెల: రూ. 5

అప్పుల ఊబిలో తెలంగాణ ఖజానా

## అప్పుల భారం ఆరు గ్యారెంటీలు

తెలంగాణ బడ్జెట్ ముందున్న సవాళ్లు ఇవే! 02

- ఆరు గ్యారంటీలతో బడ్జెట్ పై భారీ భారం
- సంక్షేమం –అభివృద్ధి మధ్య కష్టసాధ్యం
- వడ్డీలకే వేల కోట్లు వెచ్చించే పరిస్థితి
- హామీలు నిలబెట్టుకోవాలా.. ఖజానా కాపాడాలా?
- రూ.3 లక్షల కోట్ల బడ్జెట్ పై తీవ్ర ఉత్కంఠ
- పెట్టుబడి వ్యయంపై నిపుణుల హెచ్చరికలు




## మాటల మారాదీ రేవంత్

సీఎం రేవంత్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి బండి ఆగ్రహం



- పూటకో మాట మారుస్తూ పబ్బం
- ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వకుండా స్కూటీలా? 03

ఎన్టీపీసీతో

## విద్యుత్ ఒప్పందం చేసుకోండి

సీఎం రేవంత్ కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ



- పెరుగుతున్న డిమాండ్
- రామగుండంలో రెండో దశలో 2,400 మెగావాట్ల ఉత్పత్తి 10
- 85% విద్యుత్ తెలంగాణకే అందుబాటు
- తక్కువ ధరకే నాణ్యమైన విద్యుత్

## రాజ్యసభ ఏకగ్రీవం

తెలంగాణ నుంచి సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక



- స్క్రూటినీలో తిరస్కరణకు గురైన ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్
- ఎమ్మెల్యేల మద్దతు లేకుండా నామినేషన్ దాఖలు చేసిన సాయి
- ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ 10

## హైదరాబాద్–విశాఖ మధ్య తగ్గనున్న దూరం

కొవ్వూరు –జీలుగుమిల్లి మధ్య 368 కోట్లతో కొత్త హైవే..

- ఖమ్మం, దేవరపల్లి గ్రీన్ ఫీల్డు ప్రత్యామ్నాయం
- స్థానికుల సంతోషం 09




- రైతుల అప్పుల్లో తమిళనాడు మొదటి స్థానం.. రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్
- ఏడో స్థానంలో తెలంగాణ
- ఏపీ రైతులపై రూ.3.75 లక్షల కోట్ల భారీ రుణ భారం
- తెలంగాణ రైతుల నెత్తిపై రూ.1.75 లక్షల కోట్ల అప్పులు
- ఒక్కో రైతుపై సగటు అప్పు ఏపీలో రూ.2.35 లక్షలు
- తెలంగాణలో ఒక్కో రైతుపై సగటు రుణభారం రూ.1.52 లక్షలు
- పెరుగుతున్న పెట్టుబడులు, గిట్టుబాటు ధరల లేమి అప్పుల వైపు నెడుతున్నాయి

# అప్పుల్లో అన్నదాత

దేశవ్యాప్తంగా రైతులపై రూ.31 లక్షల కోట్లకు పైగా వ్యవసాయ రుణాలు

పంట రుణాలు ₹16.34 లక్షల కోట్లు.. టర్మ్ లోన్స్ ₹15 లక్షల కోట్లు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** దేశ వ్యాప్తంగా రైతులు రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. సాగు పెరుగుతున్న రుణాలు తప్పడం లేదు. సామాన్యంగా రైతుకు ఈ తిప్పలు ఎందుకు వస్తాయో అందరికి తెలిసిందే. పెట్టుబడి పెరగడం, గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రకృతి వైపరిత్యాలు వంటి ఎన్నో కారణాలు రైతును అప్పుల వైపు నెడుతున్నాయి. ఒక్కో రైతు కుటుంబంపై ఇంత భారీ స్థాయిలో అప్పు ఉండటం అనేది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుంది. పార్లమెంట్ సాక్షిగా బయటపడిన ఈ లెక్కలు రాష్ట్రాలను ఆందోళనలకు గురి చేస్తున్నాయి. రైతులపై అప్పుల్లో దేశంలో తమిళనాడు తొలి స్థానంలో ఉండగా.. తర్వాత రుణభారంలో ఏపీ రైతులు ఉన్నారు.

**తెలుగు రాష్ట్రాల రైతుల నెత్తిపై అప్పుల మోత**

తెలుగు రాష్ట్రాల్లో ఉన్న రైతుల నెత్తిపై అప్పుల కుప్ప ఉన్నట్లు పార్లమెంటు వేదికగా కేంద్రం వెల్లడించింది. దేశంలోనే రైతులపై అప్పులు ఉన్న రాష్ట్రాల జాబితాలో ఏపీ రెండో స్థానంలో నిలిచింది. ఇక ఈ లిస్ట్‌లో తెలంగాణ ఏడో స్థానంలో నిలిచింది. 2025, డిసెంబర్ 31 నాటికి ఏపీ లో రైతన్నల నెత్తిన రూ. 3,75,254 కోట్ల అప్పులు ఉండగా.. తెలంగాణలో రైతులపై రూ. 1,75,960 కోట్లు ఉన్నాయి. ఏపీలో ఒక్కో రైతుపై సగటున రూ.2.35 లక్షల అప్పు ఉండగా.. అదే తెలంగాణ రైతులపై సగటున రూ.1.52 లక్షలు ఉన్నట్లు వెల్లడించింది. దేశానికి అన్నం పెట్టేది రైతు. దేశ అభివృద్ధికి తోడుగా ఉండేది వ్యవసాయ రంగం. ఇక మన భారతదేశంలో 60 శాతానికి పైగా వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కానీ రైతులు మాత్రం మన దేశంలో నానాటికీ అప్పుల ఊబిలో కూరుకుపోతునే ఉన్నారు. రైతును రాజుగా చేయాలని అటు కేంద్ర ప్రభుత్వం.. ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు.. అన్నదాతలకు ఎన్నో రాయితీలు, పథకాలు, ఆర్థిక సహాయాలు అందిస్తున్నప్పటికీ.. రైతులు మాత్రం లాభాల్లోకి రాలేకపోతున్నారు. లాభాల మిగతా 02లో



## ఒలింపిక్స్, కామన్వెల్త్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం

క్రీడాశాఖ సమీక్షలో సీఎం రేవంత్

- ఆ మేరకు క్రీడా పాలసీకి రూపకల్పన
- అంతర్జాతీయ ప్రమాణాలకనుగుణంగా క్రీడా మైదానాలు 09
- క్రీడాకారులకు మెరుగైన శిక్షణ

## గండం గట్టెక్కలే..

ఢిల్లీ లిక్కర్ కేసులో కొత్త మలుపు

- క్లీన్ చిట్ ఇచ్చిన తీర్పుపై సీబీఐ సవాల్ 02
- కేజ్రీవాల్, కవిత సహా 23 మందికి నోటీసులు
- హైకోర్టులో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు
- సీబీఐ దర్యాప్తుపై ట్రయల్ కోర్టు తీవ్ర వ్యాఖ్యలు
- కేసు మళ్లీ తెరపైకి రావడంతో రాజకీయ చర్చలు
- తదుపరి విచారణను వారం రోజులకు వాయిదా

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** దేశ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కేజ్రీవాల్, కవిత, మనీశ్ సిసోడియా సహా మొత్తం 23 మందికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. సీబీఐ కేసులో ప్రతివాదుల నుంచి సమాధానాలు కోరింది. ఈ కేసులో నిందితులకు రౌస్ ఎవెన్యూ కోర్టు ఇటీవల క్లీన్ చిట్ ఇవ్వడాన్ని సీబీ ఐ ఢిల్లీ హైకోర్టులో సవాలు చేసింది. ఈ పిటిషన్‌పై సోమవారం ఢిల్లీ హైకోర్టు విచారణ జరిపింది. సీబీఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. దర్యాప్తు సంస్థపై తీర్పులో ప్రత్యేక కోర్టు వ్యాఖ్యలపై ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది. ఈడీ కేసు విచారణ వాయిదా వేయాలని ట్రయల్ కోర్టుకు సూచిస్తూ తదుపరి విచారణ వారం రోజులు వాయిదా వేసింది. వచ్చే సోమవారం తదుపరి విచారణ చేపట్టనుంది. దీంతో మద్యం కేసులో క్లీన్ చిట్ పొందిన 23 మందికి మళ్లీ కేసు భయం పట్టుకున్నది. నిజానికి, కింది కోర్టు తీర్పు ఇచ్చిన రోజే.. సీబీఐ ఆఘమేఘాలపై హైకోర్టులో అప్పీల్ చేసింది. కేసు క్లోజ్ అవ్వకుండా.. ఇంకా ఉంది అనిపించింది. ఈ కేసులో ఇంత సీరియస్‌గా ఉన్న సీబీఐ.. కింది కోర్టును ఎందుకు మిగతా 02లో





తెలంగాణలో

## 50 లక్షల ఓట్లు తొలగింపు!

ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఏప్రిల్‌లో ఈసీ SIR ! 10

- డూప్లికేట్ ఓట్లపై ఈసీ భారీ వడపోత..
- రెండు చోట్ల ఓటు పెట్టుకున్నవారికి చెక్
- డోర్ టు డోర్ సర్వే, సాఫ్ట్‌వేర్ పరిశీలనతో డూప్లికేట్ ఓట్ల గుర్తింపు
- హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనే లక్షల ఓట్ల తొలగింపు అంచనా
- 3.35 కోట్ల నుంచి 2.75 కోట్లకు తగ్గే అవకాశం




## ఇక డిజిటల్ సేవలు

సీఎం రేవంత్ కీలక నిర్ణయం 02

- ప్రభుత్వ శాఖలన్నింటా ఈ-ఆఫీస్
- సీఎస్ నుంచి కింది స్థాయి వరకు అమలు
- ఫైళ్ల ఆలస్యానికి చెక్.. డిజిటల్ పాలనకు గ్రీన్ సిగ్నల్
- టేబుల్ నుంచి టేబుల్‌కు తిరిగే ఫైళ్లకు ఇక ముగింపు
- సీఎస్ నుంచి సెక్షన్ ఆఫీసర్ వరకు ఈ-ఫైల్ తప్పనిసరి
- ఒక్క క్లిక్‌తో పై అధికారుల అప్రూవల్



అసలు టార్గెట్ ఇరాన్ కాదు

## ఆర్థిక సామ్రాజ్యమా?

ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణల వెనుక గల్ఫ్ ఆర్థిక ఎదుగుదలే అసలు లక్ష్యమా? 10




- పశ్చిమాసియా ఉద్రిక్తతల వెనుక ట్రంప్ వ్యూహంపై పెరుగుతున్న అనుమానాలు
- చమురు నుంచి గ్లోబల్ పెట్టుబడుల వరకు గల్ఫ్ ఎదుగుదలపై పాశ్చాత్య శక్తుల కన్ను?
- ఇరాన్‌ను సాకుగా మార్చి గల్ఫ్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలన్న వ్యూహమా?
- మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై భారీ ప్రభావం భయం



అప్ గ్రేడ్ చేసుకుంటూ

## ముందుకు సాగండి

తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్ కార్యక్రమంలో సీఎం రేవంత్ 09



## చిన్న వయసులోనే క్రికెటర్



### సంజూ శాంసన్

సంజూ శాంసన్ చాలా చిన్న వయసులోనే భారత జట్టుకు ఎంపికయ్యాడు. అతని టాలెంట్ వల్ల అండర్ 19 స్థాయి నుంచే పెద్దగా గుర్తింపు పొందాడు.





# గండం గట్టెక్కలే

**(మొదటి పేజీ తరువాయి)**

సంతృప్తి పరచలేకపోయింది? కేసు తీర్పు తెలంగాణ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపబోతోంది?.. అసలు ఈ కేసుతో కల్వకుంట్ల కుటుంబం కొంత రాజకీయ ఉపశమనానికి గురవుతుందా.. తదుపరి కవిత.. కేటీఆర్ అడుగులు ఎటువైపు అనేది ఇప్పుడు చర్చ జరుగుతున్నది.

గత నెల 28న ఢిల్లీ లిక్కర్ కేసుపై ఢిల్లీ రౌస్ అవెన్యూ స్పెషల్ సీబీఐ కోర్టు విచారణ జరిపింది. ఇందులో వాదులు, ప్రతివాదుల వాదనలు విన్న ఆ కోర్టు జడ్జి జస్టిస్ జితేంద్ర సింగ్.. ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సహా మొత్తం 23 మంది నిందితులకు ఢిల్లీ లిక్కర్ కేసులో క్లీన్ చిట్ ఇచ్చారు. ఈ కేసు విషయంలో వారిపై సీబీఐ నమోదు చేసిన అన్ని ఆరోపణలను కొట్టివేస్తూ కీలక తీర్పు ఇచ్చారు. ఈ కేసుకు సంబంధించి "ప్రైమా ఫేసీ కేసు లేదు, ఆరోపణలు ఊహాగానాలు మాత్రమే, డబ్బు మార్గం లేదు, సాక్ష్యాలు లేవు" అని స్పష్టం చేశారు. సీబీఐ దర్యాప్తును "ప్రీమెడిటేటెడ్ అండ్ కొరియోగ్రాఫ్డ్" (ముందుగా ప్లాన్ చేసిన, నాటకీయం) అని తీవ్రంగా విమర్శించి, దర్యాప్తు అధికారిని.. దీనిపై ప్రశ్నించాలని కూడా ఆదేశించారు. దాంతో ఆరోపణలు ఎదుర్కొంటోన్న నేతలందరూ ఆ కేసు నుంచి బయటపడ్డామని భావించారు. కానీ ఈ తీర్పు వచ్చిన కొన్ని గంటల్లోనే సీబీఐ దీనిపై ఢిల్లీ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. "ట్రయల్ కోర్టు తీర్పులో దర్యాప్తులోని అనేక అంశాల్ని లెక్కలోకి తీసుకోలేదు, సరిగ్గా పరిగణించలేదని ఆరోపించిన సీబీఐ కాబట్టి వెంటనే హైకోర్టులో అప్పీల్ చేసింది.

# అప్పుల్లో అన్నదాత

**(మొదటి పేజీతరువాయి)**

సంగతి పక్కన పెడితే.. వారి నెత్తిపై రోజురోజుకూ అప్పుల కుప్ప కొండలా పేరుకుపోతోంది. ఈ నేపథ్యంలోనే దేశంలో రాష్ట్రాల వారిగా రైతులపై ఉన్న అప్పులకు సంబంధించి.. కేంద్రం వివరాలు వెల్లడించింది. 2018 జూలై నుంచి 2019 జూన్ మధ్య ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న రైతుల సగటు అప్పు విలువ రూ.2,35,554 ఉన్నట్లు కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. అదే సమయంలో తెలంగాణ రైతుల సగటు అప్పు రూ.1,52,113 ఉన్నట్లు తేల్చి చెప్పారు. అదే సమయంలో దేశవ్యాప్తంగా రైతుల సగటు అప్పుల భారం రూ.74,121 ఉన్నట్లు కేంద్రమంత్రి లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు.

**మూల రంగమే ప్రమాదం**

ఇదిలా ఉంటే.. దేశఆర్థిక వ్యవస్థకు మూలం గ్రామీణ, వ్యవసాయ రంగాలే. 1991 తర్వాత చేపడుతున్న ఆర్థిక సంస్కరణలు ఇండియాను ప్రపంచంలోనే ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మలిచినా, వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతుండటంతో దేశంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడటం లేదు. మరోవైపు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. రుణమాఫీ, MSP వంటి ఉపశమన చర్యలు మూల కారణాలను పరిష్కరించలేకపోతున్నాయి.



**ఎక్కువ రుణాలు ఉన్న రాష్ట్రాలు**

| | |
|---|---|
| తమిళనాడు | ₹5,06,290 కోట్లు |
| ఆంధ్రప్రదేశ్ | ₹3,75,254 కోట్లు |
| మహారాష్ట్ర | ₹3,07,293 కోట్లు |
| ఉత్తరప్రదేశ్ | ₹2,30,096 కోట్లు |
| కర్ణాటక | ₹2,10,244 కోట్లు |
| రాజస్థాన్ | ₹1,92,293 కోట్లు |
| తెలంగాణ | ₹1,75,960 కోట్లు |
| గుజరాత్ | ₹1,68,460 కోట్లు |
| కేరళ | ₹1,61,023 కోట్లు |
| మధ్యప్రదేశ్ | ₹1,70,757 కోట్లు |

**తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ వివరాలు**

| | |
|---|---|
| **ఆంధ్రప్రదేశ్** | |
| పంట రుణాలు | ₹2,01,744 కోట్లు |
| టర్మ్ లోన్స్ | ₹1,73,510 కోట్లు |
| మొత్తం | ₹3,75,254 కోట్లు |
| **తెలంగాణ:** | |
| పంట రుణాలు | ₹95,167 కోట్లు |
| టర్మ్ లోన్స్ | ₹80,792 కోట్లు |
| మొత్తం | ₹1,75,960 కోట్లు |

**ఏపీ రైతులపై రూ. 2,01,744 కోట్ల రుణాలు 1,73,510 కోట్ల టర్మ్ లోన్ భారం మొత్తం కలిపి రైతులపై రూ. 3,75,254 కోట్ల రుణ భారం**

# ఇక డిజిటల్ సేవలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ సర్కార్ మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి అన్ని ప్రభుత్వ సేవలు ఈ–ఆఫీస్‌లోనే అని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటివరకు పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసిన ఈ–ఆఫీస్ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని శాఖల్లో అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ కార్యాలయాల్లో రోజులు, నెలల తరబడి కదలకుండా ఉండే ఫైళ్లకు మోక్షం లభించనుంది.

**ఇక ప్రభుత్వ సేవలన్నీ ఈ-ఆఫీస్‌లోనే**

ప్రభుత్వం అందించే సేవలను వేగంగా, పారదర్శకంగా ప్రజలకు చేరేలా సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. గవర్నమెంట్ ఆఫీసుల్లో కొండల్లా ఏళ్ల తరబడి మూలుగుతున్న ఫైళ్లకు క్లియరెన్స్ దక్కేలా కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ–ఆఫీస్‌లోనే ప్రభుత్వ సేవలు అమలు చేయాలని.. రాష్ట్ర ప్రభుత్వం.. అన్ని శాఖల అధికారులకు ఆదేశాలిచ్చింది. ఇప్పటివరకు కొన్ని శాఖల్లో చేపట్టిన పైలట్ ప్రాజెక్ట్ సత్ఫలితాలను ఇవ్వడంతో.. ఇక నుంచి అన్ని శాఖలకు ఈ–ఆఫీస్‌ను విస్తరించాలని నిర్ణయించింది. డిజిటల్ విధానంలో ఫైళ్లు.. కింది స్థాయి అధికారి నుంచి పై అధికారి వరకు వేగంగా జరగనున్నాయి.


**సీఎస్ నుంచి..**

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) నుంచి కింది స్థాయి సెక్షన్ ఆఫీసర్ల వరకు ఈ–ఆఫీస్ విధానంలోనే పని చేయాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పైలట్ మోడ్‌లో కొన్ని శాఖల్లో నిర్వహించిన ఈ–ఆఫీస్ విధానంపై సంతృప్తి చెందిన ప్రభుత్వం.. అన్ని శాఖల్లో అమలు చేయాలని తెలిపింది. అంతేకాకుండా ఆర్థిక శాఖ కూడా ఈ–ఫైల్ విధానంలోని ఫైళ్లను మాత్రమే పరిశీలిస్తామని.. ఎట్టి పరిస్థితుల్లో ఫిజికల్ కాపీలను పరిగణించబోమని తాజాగా ప్రత్యేకంగా సర్క్యులర్ కూడా జారీ చేసింది. అన్ని శాఖల హెచ్ఓడీలు ఈ–ఆఫీస్ ద్వారా వచ్చే ఫైళ్లను మాత్రమే క్లియర్ చేయాలని ఆర్థిక శాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇప్పటికే కొన్ని శాఖలు ఈ–ఆఫీస్‌ను ప్రారంభించగా.. మరికొన్ని ఈ వారంలోనే ప్రారంభించేలా చర్యలు చేపట్టనున్నాయి. ఈ–ఆఫీస్ పూర్తిగా అమల్లోకి వస్తే.. ఫైళ్ల కదలిక కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ.. ప్రభుత్వం ఈ–ఆఫీస్ వైపు వేగంగా అడుగులు వేయడం వల్ల.. ప్రభుత్వ సేవలు వేగంగా అందడమే కాకుండా పారదర్శకంగా, జవాబుదారీతనంగా ఉంటాయని భావిస్తుంది.

**పాత పద్ధతికి బ్రేక్**

సాధారణంగా ప్రభుత్వ ఆఫీసుల్లో ఫైళ్లు ఒక టేబుల్ నుంచి మరో టేబుల్‌కు అనుమతుల కోసం వెళ్తూ ఉంటాయి. ఇలా చేయడం వల్ల సమయం వృథా కావడమే కాకుండా.. ఫైళ్లు కూడా కనిపించకుండా పోయే ప్రమాదం ఉంటుంది. ఈ బాధలకు స్వస్తి చెప్పేందుకే ఈ ఈ–ఆఫీస్ విధానాన్ని తెచ్చారు. నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ డెవలప్ చేసిన ఒక డిజిటల్ ప్లాట్‌ఫారమ్ ద్వారా ఫైళ్లను తయారు చేయడం, వాటిని ఒక అధికారి దగ్గరి నుంచి మరో అధికారి వద్దకు తరలించడం, చెక్ చేయడం, సంతకాలు చేయడం అన్నీ ఆన్‌లైన్‌లోనే జరగనున్నాయి. నోటింగ్, డ్రాఫ్టింగ్, అప్రూవల్, రికార్డుల మెయింటెనెన్స్ ఇలా అన్నింటినీ ఆన్‌లైన్ చేయాలని సర్కార్ సూచించింది.

ఒక సెక్షన్‌కు వచ్చిన విజ్ఞప్తిని స్కాన్ చేసి పోర్టల్‌లో ఎంట్రీ చేస్తారు. దీంతో ఒక ఎన్‌రోల్ నంబర్ క్రియేట్ అవుతుంది. ఆ నంబర్‌తోనే సెక్షన్ ఆఫీసర్ నుంచి ప్రిన్సిపాల్ సెక్రటరీ వరకు ఆ ఫైల్ తిరుగుతుంది. ఫైల్ ఎక్కడ ఉంది అనేది కూడా కంప్యూటర్‌లో ఈజీగా చెక్ చేసుకోవచ్చు. సాధారణంగా పేపర్ ఫైల్ ఒక శాఖ నుంచి మరో శాఖకు వెళ్లేందుకు కొన్ని రోజుల సమయం పడుతుంది. ఈ–ఫైల్ విధానంలో ఒక్క క్లిక్ చేసి అప్రూవ్ చేస్తే.. అధికారి వద్దకు వెళ్తుంది. ఇలా చేయడం వల్ల పాలనలో వేగం పెరగడమే కాకుండా.. ఏ అధికారి వద్ద.. ఏ ఫైల్.. ఎన్ని రోజులుగా పెండింగ్‌లో ఉంది అనేది పక్కాగా తెలియనుంది. దీనివల్ల కావాలని ఫైళ్లను ఆపే అవకాశం ఉండదు. ఇలా చేయడం వల్ల ప్రతీ అధికారి.. తన విధులను సకాలంలో పూర్తి చేయాల్సి ఉంటుంది. డిజిటల్ సిగ్నేచర్ ద్వారా అధికారులు ఇతర పర్యటనల్లో ఉన్నా.. క్యాంప్ ఆఫీసుల్లో ఉన్నా ఆన్‌లైన్‌లోనే ఫైళ్లను సులువుగా క్లియర్ చేయవచ్చు.



ఇక పాత పద్ధతిలో కాగితపు ఫైళ్లు చెదలు పట్టడం, చిరిగిపోవడం, అగ్ని ప్రమాదాలు జరిగినపుడు కాలిపోయే ప్రమాదం ఉండేది. కానీ ఈ డిజిటల్ ఫైళ్లు మాత్రం క్లౌడ్ సర్వర్లలో భద్రంగా ఉంటాయి. బ్యాకప్ సౌకర్యం కూడా ఉండటంతో అందులో స్టోర్ చేసిన డేటా ఎప్పటికీ డిలీట్ కాదని అధికారులు చెబుతున్నారు. అదే సమయంలో వేల టన్నుల పేపర్లు కూడా వాడటం తగ్గనుంది. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు స్టేషనరీ ఖర్చును తగ్గించడమే కాకుండా.. చెట్లను కాపాడటం ద్వారా పర్యావరణానికి కూడా మేలు చేస్తుందని అధికారులు భావిస్తున్నారు.

పైలట్ సక్సెస్

ఇప్పటికే ఏపీలోని కొన్ని శాఖల్లో ఈ–ఆఫీస్ సక్సెస్‌ఫుల్‌గా అమలు అవుతోంది. తాజాగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు, జిల్లా కార్యాలయాలు, అటానమస్ సంస్థలు కచ్చితంగా ఈ–ఫైల్ విధానాన్ని పాటించాలని రేవంత్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అదే సమయంలో పాత రికార్డులు కూడా డిజిటలైజేషన్ చేసే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. ఇక జిల్లా కార్యాలయాల నుంచి సెక్రటేరియట్‌లోని సంబంధిత విభాగాలకు కూడా కనెక్టివిటీని ఏర్పాటు చేసేందుకు కసరత్తులు చేస్తున్నారు. ఒక శాఖకు సంబంధించి.. జిల్లా స్థాయిలో ఫైల్‌ను పంపించినా.. సచివాలయంలో ఉండే ప్రిన్సిపాల్ సెక్రటరీ నేరుగా పరిశీలించి.. ఆ ఫైల్‌ను క్లియర్ చేసేలా ఈ సాఫ్ట్‌వేర్‌ను తయారు చేశారు. ఇది ప్రస్తుతం ట్రయల్స్‌లో ఉండగా.. త్వరలోనే అందుబాటులోకి రానుంది.

# అప్పుల భారం vs ఆరు గ్యారెంటీలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఒక వైపు అప్పులు.. మరో వైపు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు.. గతంలో తీసుకున్న అప్పులకు వడ్డీలు.. ఇప్పుడు కొత్తగా ఏం చేయాలన్నా అప్పు మీదే ఆధారం.. మొత్తంగా తెలంగాణ బడ్జెట్ ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది. అప్పులు, హామీల మధ్య సమతుల్యం చేసుకోవడం సమస్యగా మారుతోంది. బడ్జెట్ రూపకల్పనలో సీఎం, డిప్యూటీ సీఎం, ఆర్థిక నిపుణులు ఆయోమయంలో పడిపోతున్నారు.

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు కేవలం అంకెల గారడీగా కాకుండా, అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ రణక్షేత్రంగా మారబోతున్నాయి. ఒక వైపు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శ్వేత పత్రం డిమాండ్‌తో సర్కారును కార్నర్ చేస్తుంటే, మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ప్రభుత్వ అప్పుల చిట్టాను విప్పుతూ ఎదురుదాడికి దిగుతున్నారు. సుమారు 3 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు కసరత్తు జరుగుతున్న వేళ, రాష్ట్ర ఖజానా అసలు స్థితిగతులపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సంక్షేమం అభివృద్ధి మధ్య సమతూకం పాటించడం ఇప్పుడు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు కత్తిమీద సాములా మారింది.

**అప్పల కుప్ప.. వడ్డీల తిప్ప**

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అప్పుల ఊబి వేధిస్తోంది. గత పదేళ్లలో అప్పులు రూ.7.5 లక్షల కోట్లకు చేరాయని ముఖ్యమంత్రి ఆరోపిస్తుండగా, అధికారిక లెక్కలు భిన్నంగా ఉన్నాయి. అయితే, ఏ లెక్క చూసినా నెలకు వేల కోట్ల రూపాయలు కేవలం వడ్డీల చెల్లింపులకే వెచ్చించాల్సి వస్తోంది. ఈ డెట్ ట్రాప్ నుంచి బయటపడి, కొత్త ప్రాజెక్టులకు నిధులు మళ్లించడం ప్రభుత్వానికి అతిపెద్ద సవాలు. అప్పు తెచ్చి పప్పు కూడు అన్నట్లుగా కాకుండా, ఆదాయ వనరులను పెంచుకోవడమే ఏకైక మార్గమని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**గ్యారంటీల భారం.. ఖజానాకు గండం**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ఆరు గ్యారంటీలు బడ్జెట్‌లో సింహభాగాన్ని ఆక్రమించనున్నాయి. రైతు భరోసా, మహాలక్ష్మి , గృహజ్యోతి వంటి పథకాల అమలుకు ఏటా రూ. 56,000 కోట్ల పైచిలుకు నిధులు అవసరమని అంచనా. ఎన్నికల వాగ్దానాలను నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉన్న ప్రభుత్వం, ఈ నిధుల కోసం ఇతర శాఖల కేటాయింపుల్లో కోత విధిస్తుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తూనే, మౌలిక సదుపాయాలను విస్మరించకూడదనే ఒత్తిడి సర్కారుపై ఉంది.

**పెట్టుబడి వ్యయంపై విమర్శలు**

రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడి వ్యయం విషయంలో ప్రభుత్వం కొంత వెనుకబడి ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బడ్జెట్‌లో రూ. 36,000 కోట్లు కేటాయించినా, క్షేత్రస్థాయిలో ఖర్చు ఎంత అన్నదే కీలకం. జీతాలు, పెన్షన్లు వంటి రెవెన్యూ వ్యయం భారంగా మారుతున్న తరుణంలో, సాగునీటి ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం వంటి ఆస్తుల సృష్టికి నిధులు తగ్గిస్తే దీర్ఘకాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంది. సంక్షేమంతో పాటు సంపద సృష్టిని కూడా సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ట్రిలియన్ డాలర్ల కల**

తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం నెరవేరాలంటే, ఆదాయ మార్గాలను గణనీయంగా పెంచుకోవాలి. అటవీ, ఎక్సైజ్, స్టాంపులు–రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు కేంద్రం నుంచి రావాల్సిన పన్నుల వాటా, గ్రాంట్లపై రాష్ట్రం ఆశలు పెట్టుకుంది. కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే నిధులు రాబట్టుకోవడం రాజకీయంగానూ, ఆర్థికంగానూ ఇప్పుడు అనివార్యం. ఈ బడ్జెట్ సమావేశాలు తెలంగాణ ఆర్థిక దిశను నిర్దేశించనున్నాయి. కిషన్ రెడ్డి డిమాండ్ చేసినట్లుగా ప్రభుత్వం పారదర్శకంగా వివరాలు వెల్లడిస్తుందా? లేక రాజకీయ ఆరోపణలకే పరిమితమవుతుందా అన్నది చూడాలి. సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచుతూనే, ఆర్థిక క్రమశిక్షణను పాటించడమే రేవంత్ సర్కార్ ముందున్న అసలైన పరీక్ష.



# అమెరికా యుద్ధ స్మారకం వద్ద రీల్స్

## తెలుగు ఉద్యోగి తొలగింపు..

## తెలుగోళ్లు అంటేనే అమెరికా కంపెనీల సీరియస్


**ముద్ర డెస్క్ :**

అంతర్జాతీయ టెక్ దిగ్గజం 'పాలో ఆల్టో నెట్‌వర్క్స్' సంస్థ ప్రస్తుతం వరుస వివాదాలతో వార్తల్లో నిలుస్తోంది. ఒకవైపు నియామక ప్రక్రియలో ప్రాంతీయ వివక్ష ఆరోపణలు సంస్థపై తీవ్ర విమర్శలకు దారి తీయగామరోవైపు కంపెనీకి చెందిన భారతీయ సంతతి ఉద్యోగి ఒకరు చేసిన అసభ్యకరమైన వీడియో వ్యవహారం సంస్థ ప్రతిష్టను మసకబార్చింది. ఈ రెండు ఘటనలు సోషల్ మీడియా వేదికగా భారతీయ టెక్ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి.

**అభ్యర్థుల ఎంపికలో ప్రాంతీయ వివక్ష?**

నియామక ప్రక్రియలో చోటుచేసుకున్నట్లుగా చెబుతున్న ఒక సంఘటన టెక్ నిపుణులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పాలో ఆల్టో నెట్‌వర్క్స్‌లో ఇంటర్వ్యూకి హాజరైన ఒక అభ్యర్థి తన చేదు అనుభవాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఇంటర్వ్యూ సమయంలో హెచ్ఆర్ ప్రతినిధి, అభ్యర్థిని ఆయన ఇండియాలోని స్వరాష్ట్రం గురించి ఆరా తీశారు. అభ్యర్థి తనది తమిళనాడు అని చెప్పిన తర్వాతే ఇంటర్వ్యూ తదుపరి ప్రక్రియ కొనసాగిందని ఆయన పేర్కొన్నారు.

అంతేకాకుండా తాము ప్రధానంగా తమిళనాడు లేదా కేరళకు చెందిన అభ్యర్థులకే ప్రాధాన్యతనిస్తున్నామని, గతంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొంత మంది అభ్యర్థుల వల్ల ఇంటర్వ్యూలలో మోసపూరిత ఘటనలు జరిగాయని, అందుకే ఈ నిర్ణయం తీసు



కున్నామని హెచ్ఆర్ పేర్కొన్నట్లుగా ఆ అభ్యర్థి వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు బయటకు రావడంతో తెలుగు రాష్ట్రాల వ్యక్తుల చేష్టలు బయటపడుతున్నాయి.. కొంతమంది వ్యక్తులు చేసిన తప్పులకు మొత్తం ప్రాంతానికి చెందిన అభ్యర్థులు ఇక్కడ బలికావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అభ్యర్థుల ఎంపికలో ప్రాంతీయ వివక్ష చూపడం అత్యంత దారుణమని నెటిజన్లు మండిపడుతున్నారు.

**స్మారక స్థలం వద్ద అసభ్య ప్రవర్తన: ఉద్యోగిపై వేటు**

ఒకవైపు వివక్ష ఆరోపణలు కంపెనీని ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా మరోవైపు అదే సంస్థలో పనిచేస్తున్న మధు రాజు అనే భారతీయ మూలాలున్న ఉద్యోగి చేసిన పని సంస్థను అప్రతిష్ట పాలు చేసింది. అమెరికాలోని ప్రతిష్టాత్మకమైన 'వరల్డ్ వార్ II మెమోరియల్' వద్ద ఆయన డ్యాన్స్ చేస్తూ వీడియో తీశారు. యుద్ధ వీరుల త్యాగాలకు నిదర్శనంగా నిలిచే పవిత్రమైన ప్రాంతంలో బాధ్యతారహితంగా డ్యాన్స్ చేయడంపై అమెరికన్లతో పాటు భారతీయులు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కంపెనీ ప్రతిష్టకు భంగం వాటిల్లింది. దీనిపై వెంటనే స్పందించిన పాలో ఆల్టో నెట్‌వర్క్స్ యాజమాన్యం తమ సంస్థ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారన్న కారణంతో మధు రాజును తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించింది. కంపెనీ ప్రతిష్టను దెబ్బతీసే ఏ చర్యను కూడా ఉపేక్షించబోమని సంస్థ వర్గాలు కఠినంగా స్పష్టం చేశాయి.

**నిపుణుల హెచ్చరిక.. ఏం జరగాలి?**


ఈ రెండు ఘటనల నేపథ్యంలో అంతర్జాతీయ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. సోషల్ మీడియాలో చేసే చిన్న పొరపాట్లు కూడా వ్యక్తిగత కెరీర్‌నే కాకుండా సంస్థ ప్రతిష్టను కూడా దెబ్బతీస్తాయని హెచ్చరిస్తున్నారు. అదే సమయంలో, ఒకరి తప్పును భూతద్దంలో చూపి మొత్తం ప్రాంతానికి చెందిన అభ్యర్థులపై ముద్ర వేయడం నిబంధనలకు విరుద్ధమని ఇది నియామక ప్రక్రియలో పారదర్శకతను దెబ్బతీస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒక బహుళజాతి సంస్థ ఇటువంటి వివాదాల నుంచి పాఠాలు నేర్చుకుని నియామకాల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ఉద్యోగుల ప్రవర్తన పట్ల మరింత నిఘా ఉంచాలని టెక్ రంగంలోని నిపుణులు సూచిస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
10.03.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**సంజూశాంసన్**
**కేరళ నుంచి వచ్చిన స్టార్**

కేరళ రాష్ట్రం నుంచి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రముఖ క్రికెటర్లలో సంజూ ఒకరు.









# భువనగిరిలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆటోను డీసీఎం ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి





**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**
యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి – జగదేవపూర్ ప్రధాన రహదారి వడపర్తి శివారులో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆటోను డీసీఎం వాహనం ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. భువనగిరి మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన డొంకెన నరేష్ అక్కడికక్కడే మృతి చెందగా సురేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన కేతమ్మను హైదరాబాదు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందడంతో తిమ్మాపురం గ్రామంలో విషాదం నెలకొంది.

# మాటల మారాఠీ రేవంత్

- పూటకో మాట మారుస్తూ సీఎం పబ్బం
- ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వకుండా.. స్కూటీలా?
- పేదలు, దళిత, గిరిజనులకు లేకుండా జర్నలిస్టులకు భూములా?
- సీఎం రేవంత్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి బండి ఆగ్రహం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
పూటకో మాటతో పబ్బం గడుపుతోన్న సీఎం రేవంత్ రెడ్డి మాటల మరాఠీగా అవతారమెత్తారని కేంద్ర హెం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ప్రసంగించిన సీఎం.. త్వరలోనే కాలేజీ విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు అందించబోతున్నామంటూ చేసిన ప్రకటనపై బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి పూటకో మాట మారుస్తున్నారని సోమవారం ఎక్స్ వేదికగా దుయ్యబట్టారు. కాలేజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయన్న ఆయన సీఎం మాత్రం ఉచిత ఈవీ స్కూటర్లు ఇస్తామని హామీ ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. పేదలు, దళిత, గిరిజనులకు ఇచ్చేందుకు భూములు లేవని చెబుతున్న రేవంత్ రెడ్డి జర్నలిస్టులకు, మూసీ బాధితులకు భూములు ఇస్తామని ఎలా చెప్పగలుగుతున్నారని ప్రశ్నించారు. పెన్షన్లు చెల్లించడానికి ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని చెబుతూనే ఓవైసీ ఒక్క పిలుపునిస్తే మూసీ ప్రాజెక్టు కోసం రూ. వేల కోట్లు ఏర్పాటు చేస్తున్నారని దుయ్యబట్టారు.



# పసుపు రంగులో కల్లు..!

**ముద్ర , పెద్దపల్లి :**
పెద్దపల్లి జిల్లా మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలోని తాటి వనంలో ఓ తాటి చెట్టుకు వింతగా పసుపు రంగులో తాటి కల్లు రావడం పట్ల ప్రజలు ఆశ్చర్యానికి లోనయ్యారు. రోజువారీగా తాటి చెట్లు ఎక్కేందుకు వచ్చిన కునూరి సత్తయ్య గౌడ్ తాటి చెట్టు ఎక్కి కళ్ళు గీస్తుండగా.. ఒక గెల నుంచి తాటికల్లు పసుపు రంగులో రాగా ఆ గౌడ్ ఆశ్చర్యానికి గురయ్యాడు. రోజు తాటికల్లు తెలుపు రంగులో వచ్చే కల్లు.. ఉన్నట్టుండి సోమవారం పసుపు రంగులో రావడం ఏంటని గౌడ్ ఆశ్చర్యానికి గురయ్యాడు. దీంతో వెంటనే చెట్టు దిగి తోటి గీత కార్మికులకు ఈ విషయాన్ని తెలిపారు. రోజువారీగా తాటికల్లును గీసే గౌడ్ తాటి చెట్టుకు పసుపు రంగులో తాటికల్లు రావడంతో ఇదంతా ఎల్లమ్మ తల్లి మహిమ అని అందరూ అంటుండడంతో వెంటనే ఎల్లమ్మ తల్లికి మొక్కుకొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకుని త్వరలోనే గుడి ప్రారంభోత్సవం చేస్తామని వేడుకున్నారు.

# కోళ్లను మింగేస్తున్న వైరస్

**ముద్ర డెస్క్ :**
నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం చెన్నపురావుపల్లిలో బాయిలర్ కోళ్లు వేలసంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. రెండు ఫౌల్ట్రీ ఫామ్స్‌లో అంతుచిక్కని వైరస్‌తో పెద్దఎత్తున చనిపోతున్నాయి. మూడు రోజులుగా వేల సంఖ్యలో కోళ్లు చనిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటివరకు 10 వేల కోళ్లు మృత్యువాత పడినట్లు పేర్కొంటున్నారు. అయితే ఎందుకు చనిపోతున్నాయో తెలియడం లేదంటున్నారు. రోజురోజుకు ఈ సంఖ్య పెరుగుతోందని, దీని గురించి అధికారులు చర్యలు తీసుకోవాలని చెబుతున్నారు. అంతుచిక్కని వైరస్‌తో తెలంగాణ వ్యాప్తంగా లక్షల కోళ్లు చనిపోయినట్టు ఫౌల్ట్రీ రైతులు అంటున్నారు. శాంపిల్స్‌ను తీసి ల్యాబ్స్‌కి పంపించారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలం చిన్నపురావుపల్లిలో ఉన్న ఓ ఫారంలో 5 వేల కోళ్లు చనిపోగా.. నాగర్ కర్నూల్ మండలం రాంరెడ్డిపల్లి తండాలో 1,500 కోళ్లు, ఇతర ప్రాంతాల్లో మరో 4 వేల వరకు కోళ్లు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వైరస్‌ను గుర్తించేందుకు శాంపిళ్లను సేకరించినట్లు అధికారులు తెలిపారు.

# అమెరికా కంటే హైదరాబాదే బెస్ట్

- కమర్షియల్ రియల్ ఎస్టేట్‌లో భాగ్యనగరం హాట్ స్పాట్
- విదేశాల నుంచి పెట్టుబడుల వెల్లువ
- తక్కువ ధరలు.. ఎక్కువ ఆదాయం
- రాష్ట్ర రాజధానికి మళ్లుతున్న ఎన్ఆర్ఐలు



**ముద్ర డెస్క్ :**
ప్రస్తుత ప్రపంచ ఆర్థిక పరిస్థితుల్లో పెట్టుబడిదారులు తమ సొమ్ముకు అత్యధిక భద్రత, గరిష్ట రాబడిని ఆశిస్తున్నారు. ఒకప్పుడు విదేశీయుల పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న అమెరికా వంటి దేశాల కంటే ఇప్పుడు మన హైదరాబాద్ నగరం ఎన్ఆర్ఐల తొలి ప్రాధాన్యతగా మారుతోంది. ఐటీ రంగంలో ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన ఈ నగటరం, ఇప్పుడు కమర్షియల్ రియల్ ఎస్టేట్ రంగంలో హాట్ స్పాట్ గా అవతరించింది. ఎన్ఆర్ఐలు అమెరికా వైపు చూడటం తగ్గించి హైదరాబాద్‌పై ఎందుకు మక్కువ చూపుతున్నారన్నది హాట్ టాపిక్ గా మారింది.

**పెట్టుబడిపై అధిక రాబడి**
ఎన్ఆర్ఐలు హైదరాబాద్‌ను ఎంచుకోవడానికి ప్రధాన కారణం పెట్టుబడిపై వచ్చే రాబడి. గణాంకాలను పరిశీలిస్తే, అమెరికాలో సుమారు రూ. 8 కోట్ల పెట్టుబడికి వచ్చే అద్దె ఆదాయం నెలకు రూ. 3 లక్షలు మాత్రమే. అదే మొత్తాన్ని హైదరాబాద్‌లోని ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లో పెట్టుబడి పెడితే నెలకు రూ. 5 లక్షల నుండి రూ. 6 లక్షల వరకు అద్దె ఆదాయం పొందే అవకాశం ఉంది. రెంటల్ యీల్డ్ పరంగా చూస్తే హైదరాబాద్ రెట్టింపు లాభాలను అందిస్తుండటం ఎన్ఆర్ఐలను విశేషంగా ఆకర్షిస్తోంది.

**తక్కువ ధరలు.. ఎక్కువ లాభాలు**
అమెరికాలోని ప్రధాన నగరాల్లో కమర్షియల్ ప్రాపర్టీ ధరలు సామాన్య పెట్టుబడిదారులకు అందుబాటులో లేవు. అక్కడ ఆఫీస్ స్పేస్ చదరపు అడుగు ధర రూ. 40,000 నుండి రూ. 60,000 వరకు ఉంటుంది. కానీ హైదరాబాద్‌లో అదే స్థాయి మౌలిక వసతులు, ప్రీమియం ఆఫీస్ స్పేస్ కేవలం రూ. 12,000 నుండి రూ. 20,000 మధ్య లభిస్తోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ విస్తీర్ణం కలిగిన వాణిజ్య స్థలాన్ని కొనుగోలు చేయవచ్చు.. ఇది దీర్ఘకాలంలో ఆస్తి విలువ పెరగడానికి కూడా తోడ్పడుతుంది.

**గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల జోరు**
హైదరాబాద్ నగరం కేవలం ఐటీ కంపెనీలకే పరిమితం కాలేదు. గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థలు తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను హైదరాబాద్‌లో విస్తరిస్తున్నాయి. దీనివల్ల వాణిజ్య కార్యాలయ స్థలాలకు డిమాండ్ విపరీతంగా పెరుగుతోంది. అంతర్జాతీయ సంస్థలు తమ కార్యాలయాల కోసం హైదరాబాద్‌ను ఎంచుకోవడం వల్ల ఇక్కడ కమర్షియల్ రియల్ ఎస్టేట్‌కు ఎప్పటికీ తిరుగుండదని ఎన్ఆర్ఐలు బలంగా నమ్ముతున్నారు.

**మౌలిక వసతులు.. ప్రభుత్వ ప్రోత్సాహం**
హైదరాబాద్‌లోని అత్యాధునిక మౌలిక వసతులు పెట్టుబడిదారులకు భరోసానిస్తున్నాయి. మెట్రో రైలు వ్యవస్థ, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన ఎయిర్‌పోర్టు కనెక్టివిటీ, విస్తృతమైన ఐటీ కారిడార్లు పెట్టుబడిదారులకు సౌకర్యంగా మారాయి. అంతే కాకుండా తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న పారదర్శకమైన .. పెట్టుబడి అనుకూల విధానాలు రియల్ ఎస్టేట్ రంగానికి కొండంత అండగా నిలుస్తున్నాయి.

**భవిష్యత్తుకు భరోసా**
రాబోయే కొన్నేళ్లలో హైదరాబాద్ మరింత విస్తరించనుంది. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్ వంటి రంగాలు నగరంలో మళ్ళీ వేగంగా పుంజుకుంటున్నాయి. ఈ పరిణామాలు వాణిజ్య స్థలాల విలువను మరింత పెంచే అవకాశం ఉంది. అమెరికా వంటి అభివృద్ధి చెందిన మార్కెట్లలో ఇప్పటికే సంతృప్త స్థాయి కి చేరుకున్న ధరలతో పోలిస్తే, హైదరాబాద్‌లోని మార్కెట్ ఇంకా వృద్ధి దశలోనే ఉంది. అందువల్ల, స్థిరమైన ఆదాయం మరియు ఆస్తి విలువ పెరుగుదల కోసం ఎన్ఆర్ఐలు హైదరాబాద్ వైపు చూడటం అత్యంత వివేకవంతమైన నిర్ణయమని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.



# ఆశీర్వాద యాత్రకు శ్రీకారం

- 14న కొండగట్టుకుకు బండి సంజయ్
- నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులతో కలిసి 40 కిలోమీటర్ల పాదయాత్ర

**ముద్ర, కరీంనగర్ :**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అంజన్న ఆశీర్వాద యాత్ర పేరిట ఈనెల 14న పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, ఉప సర్పంచులు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేషన్ కార్పొరేటర్లు, మేయర్, డిప్యూటీ మేయర్ తోపాటు దాదాపు 10 వేల మంది కార్యకర్తలతో కలిసి ఈ మహా పాదయాత్ర చేయబోతున్నారు. కరీంనగర్ మేయర్ పదవిని బీజేపీకి అప్పగిస్తే తన పార్లమెంట్ పరిధిలోని నూతనంగా ఎన్నికైన బీజేపీ ప్రజాప్రతినిధులందరితో కలిసి కొండగట్టు అంజన్న ఆలయానికి కాలినడక వస్తానని సంజయ్ మొక్కుకున్నారు దీనిలో భాగంగానే ఈ పాదయాత్రకు శ్రీకారం చుట్టారు.14న ఉదయం 7 గంటలకు కరీంనగర్ లోని మహాశక్తి ఆలయం నుండి ఈ మహా పాదయాత్రను ప్రారంభిస్తారు. అవసరమైన ఏర్పాట్ల కోసం డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఓ కమిటీని నియమించారు. బీజేపీ కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల ఇన్ ఛార్జ్ లు భండారి శాంతి కుమార్, మోహన్ రెడ్డి, ఆయా జిల్లాల అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్, కార్పొరేటర్ బోయినిపల్లి ప్రవీణ్ కుమార్ ఈ కమిటీలో ఉన్నారు. వారితో పాటు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు సైతం మహా పాదయాత్ర ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహించే ఈ పాదయాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

# నెయ్యి ట్యాంకర్ బోల్తా

- బిందెలతో ఎగబడ్డ జనం



**ముద్ర డెస్క్ :**
పెట్రోల్ ట్యాంకులు, ఆయిల్ ట్యాంకులు బోల్తా పడినప్పుడు సర్వసాధారణంగా అక్కడ ఉన్న స్థానికులు.. అందులోని చమురును బిందెలలో పట్టుకొని వెళ్లిన ఇన్సిడెంట్స్ చాలాసార్లు జరిగాయి. అయితే ఈసారి ఏకంగా తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లే నెయ్యి ట్యాంకర్ బోల్తా పడటంతో స్థానికులు ఎగబడ్డారు. అందులో ఉన్న నెయ్యి అంతా ఖాళీ చేశారు. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని కొండాపురం మండలం చిత్రావతి వంతెన వద్ద తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లే ట్యాంకర్ బోల్తా పడింది. దీంతో అందులో ఉన్న నెయ్యి అంతా కింద పడుతూ ఉండడంతో స్థానికులు ఆ నెయ్యి ట్యాంకర్ వద్దకు ఎగబడి వచ్చారు. బిందెలు, బకెట్లు, చెంబులు, వాటర్ బాటిల్లు.. కొంతమంది అయితే ఏకంగా డ్రమ్ములతో నెయ్యిని తోడేశారు. ఏ వస్తువు అందితే దానితో.. నెయ్యిని తీసుకువెళ్లిపోవడంతో ట్యాంకర్ ఖాళీ అయింది.. ఈలోపు స్పందించిన పోలీసులు అక్కడకు చేరుకొని వారిని నియంత్రించారు. అయితే ఈలోపే జరగాల్సిన నష్టమంతా జరిగిపోయింది. పూణే నుంచి తిరుమల తిరుపతి దేవస్థానానికి వస్తున్న ట్యాంకర్ కొండాపురం మండలం చిత్రావతి వంతెన సమీపంలో బోల్తా పడింది. స్థానికులు ట్యాంకర్‌లోని దాదాపు 21 వేల లీటర్ల నెయ్యిని తోడేశారు. చివరకు అందులో 500 లీటర్లు మాత్రమే మిగిల్చారు.

# తొలిగిన అడ్డు గోడ

- తగ్గిన దూరం
- ప్రణీత్ ఆంటిల్యాలో దారి కష్టాలకు చెక్
- కోర్టు ఉత్తర్వులతో ప్రహరీని పడేసిన హైడ్రా




**ముద్ర, హైదరాబాద్:**
అడ్డుగోడ తొలగిస్తే 3 కిలోమీటర్లు.. లేదంటే 8 కిలోమీటర్లు ప్రయాణించాల్సిన అవస్థలకు హైడ్రా చెక్ పెట్టింది. మాది గేటెడ్ కమ్యూనిటీ అంటూ 40 ఫీట్ల రహదారిని మూసేసి నిర్మించిన ప్రహరీని హైడ్రా సోమవారం తొలగించింది. దీంతో 5 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సిన కష్టం మల్లంపేట ప్రాంత నివాసితులకు తీరింది. ఔటర్ రింగు రోడ్డు ఎగ్జిట్ 4 నుంచి మల్లంపేట, బాచుపల్లి క్రాస్‌రోడ్స్ మీదుగా ప్రగతినగర్‌కు సులభంగా చేరుకునే మార్గం దొరికింది.

**హైకోర్టు మార్గదర్శకాలు ప్రకారం..**
మల్లంపేటలో రహదారికి అడ్డంగా ప్రణీత్ ఆంటీల్యా నిర్మించిన ప్రహరీపై హైడ్రాకు ఫిర్యాదు అందింది. రహదారికి ఆటంకాలు సృష్టించడంపై ప్రణీత్ ఆంటీల్యా నిర్వాహకులకు హైడ్రా నోటీసులు ఇచ్చింది. హైడ్రా నోటీసుపై ప్రణీత్ ఎన్టీల్యావారు హై కోర్టును ఆశ్రయించారు. డ్యూ ప్రొసీజర్ ఫాలో అవ్వాలని హైకోర్టు హైడ్రాకు సూచించింది. ఈ మేరకు ఇరుపక్షాలు పిలిచి చర్చించింది. హెచ్ఎండీఏ అనుమతించిన ఔట్ ప్రకారం గేటెడ్ కమ్యూనిటీ కాదు అని నిర్ధారించుకున్నది. గేటెడ్ కమ్యూనిటీ నిబంధనల మేరకు ప్రత్యేకంగా దారుల కేటాయింపులు కూడా జరగలేదు. హైకోర్టు సూచనల మేరకు నోటీసులు యిచ్చి రోడ్డుకు అడ్డంగా నిర్మించిన ప్రహరిని హైడ్రా తొలగించింది. హెచ్ఎండీఏ బీటీ రోడ్డు కూడా వెంటనే చేపట్టింది. ఈ రోజు సాయంత్రానికి పూర్తవుతుంది. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మండలంలోని మల్లంపేట – బాచుపల్లి గ్రామాల మధ్య నెలకొన్న వివాదం ఇది.




**5 కిలో మీటర్లు తగ్గిన దారి..**
మల్లంపేట ఔటర్ రింగురోడ్డు ఎగ్జిట్ నుంచి బాచుపల్లి క్రాస్ రోడ్స్ మీదుగా ప్రగతినగర్‌కు కేవలం 3 కిలోమీటర్లు మాత్రమే ప్రయాణిస్తే సరిపోతోంది. కాని దారి మధ్యలో ప్రణీత్ ఆంటిల్యా వారు నిర్మించిన అడ్డుగోడతో 8 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వచ్చేది. సోమవారం ప్రహరీ తొలగడంతో ఆ దూరం 3 కిలోమీటర్లకు తగ్గింది. మల్లంపేట ఎగ్జిట్ నుంచి మల్లంపేట విలేజ్, ప్రణీత్ లీఫ్‌కాలనీ, ఆకాష్ వెంచర్, డ్రీం వ్యాలీ కాలనీ, గ్రీన్‌పార్కు కాలనీ, సాయినగర్ కాలనీ, బృందావన్ కాలనీ, ఏపీఆర్ కాలనీ, ఇందిరమ్మకాలనీ, లక్ష్మి శ్రీనివాస్ కాలనీ, హెచ్ ఎండీఏ, ప్రణీత్ ఆంటిల్యా, బాచుపల్లి చౌరస్తా మీదుగా ప్రగతినగర్‌కు కేవలం 3 కిలోమీటర్ల రాజమార్గంలో రాడానికి అవకాశం లభించింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
10.03.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in
@mudranews
mudratv



మీ 'ముద్ర' వేయండి
నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# ప్రీ ప్రైమరీ తరగతులు అన్ని స్కూళ్ళలో ప్రారంభించాలి

- రాష్ట్ర బడ్జెట్లో విద్యా రంగానికి 20 శాతం నిధులు కేటాయించాలి





మార్చి 20న ప్రవేశపెట్టే తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. విద్యారంగంలో నిధుల కొరత కారణంగా పాఠశాలల నిర్వహణ సక్రమంగా జరగడం లేదని పేర్కొంది. తెలంగాణ రాష్ట్రం విద్యకు కేవలం 7.57 శాతం మాత్రమే కేటాయిస్తుండగా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలు 13 నుండి 18 శాతం వరకు కేటాయిస్తున్నాయని తెలిపింది. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ కూడా తెలంగాణ కంటే ఎక్కువ నిధులు కేటాయిస్తున్నాయని వివరించింది.2014-15లో తెలంగాణ బడ్జెట్‌లో విద్యకు 10.89 శాతం ఉండగా, 2023-24 నాటికి అది 6.5 శాతానికి తగ్గిందని తెలిపింది. ఎన్నికల సమయంలో విద్యకు 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పిన ప్రభుత్వం, 2024-25లో 7.3 శాతం, 2025-26లో 7.57 శాతం మాత్రమే కేటాయించిందని పేర్కొంది. ఈసారి బడ్జెట్‌లో కనీసం 20 శాతం నిధులు ఇవ్వాలని డిమాండ్ చేసింది.నిధుల కొరత వల్ల రాష్ట్రంలో 13,574 పాఠశాలల్లో సరైన గదులు లేవని, 21,507 పాఠశాలల్లో ఒక్కటే టాయిలెట్ ఉందని తెలిపింది. 22,047 పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు లేవని, దాదాపు 20 వేల స్కూళ్లలో ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారని పేర్కొంది. అనేక పాఠశాలల్లో సైన్స్, గణితం, భాషా ఉపాధ్యాయుల కొరత ఉందని తెలిపింది. గత రెండు సంవత్సరాల్లో దాదాపు 4 వేల పాఠశాలలు మూతపడ్డాయని ఆందోళన వ్యక్తం చేసింది.రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 26 జిల్లాలకు పూర్తి స్థాయి జిల్లా విద్యాశాఖ అధికారులు లేరని, ఇంచార్జ్ అధికారులతో వ్యవస్థ బలహీనపడిందని పేర్కొంది. విద్యారంగానికి సంబంధించిన అధికారులనే డీఈఓలుగా నియమించాలని డిమాండ్ చేసింది. అలాగే పాఠశాలల్లో అటెండర్లు, వాచ్‌మెన్లు లేకపోవడంతో విలువైన పరికరాలకు రక్షణ లేకుండా పోతోందని తెలిపింది.ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టు మంజూరు చేయాలని, విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు పెంపొందించడానికి చర్యలు తీసుకోవాలని కోరింది. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభించి తగిన ఉపాధ్యాయులు, వసతులు కల్పించాలని సూచించింది. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణకు కూడా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచి, ఖాళీగా ఉన్న అధికారుల పోస్టులను భర్తీ చేసి, విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తేనే తెలంగాణను విద్యలో నంబర్ వన్‌గా నిలపగలమని బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఇంజమూరి రఘునందన్ పేర్కొన్నారు.



ఇంజమూరి రఘునందన్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సెల్: 9866102962
బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్)

# స్వాతంత్ర్య సమర యోధుడు జి.ఎస్.మేల్కోటే

- మార్చి 10...జి.ఎస్.మేల్కోటే వర్ధంతి




జి.ఎస్.మేల్కోటే, గా ప్రసిద్ధిచెందిన గోపాలయ్య సుబ్బుకృష్ణ మేల్కోటే సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమర యోధుడు, వైద్యుడు, పరిపాలనా దక్షుడు. ఆయన సుబ్బుకృష్ణ దంపతులకు ఒడిషా రాష్ట్రంలోని బరంపురంలో 1901 అక్టోబరు 17 విజయ దశమి రోజున జన్మించాడు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎల్.ఎం.ఎస్ పరీక్షలో 1927లో మొదటి తరగతిలో మొదటి వారుగా ఉత్తీర్ణులై బంగారు పతకం అందుకున్నాడు. దేశీయ వైద్య విధానాన్ని, యోగాసనాల ప్రభావా న్ని జోడించి ఉత్తమ వైద్యులుగా ఖ్యాతి పొందాడు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, హైదరా బాదు అధ్యక్షులుగా పనిచేశాడు. ఇతను పతంజలి యోగ పరిశోధనా కేంద్రాన్ని స్థాపించాడు. స్వతంత్ర భారతదేశంలో ఆయన ఎన్నో బాధ్యతాయుత పదవులు నిర్వహించాడు. హైదరాబాదు శాసనసభలో 1952 నుండి 1956 వరకు సభ్యులై మొదట ప్రజా పనుల శాఖలో తర్వాత ఆర్థిక శాఖలో మంత్రి పదవి నిర్వర్తిం చాడు. ఆయన ముషీరాబాదు నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికయ్యాడు. 1957లో రాయ చూరు లోకసభ నియోజకవర్గం నుండి తొలి సారిగా పార్లమెంటుకు ఎన్నికయ్యాడు. 1962 నుండి 1977 వరకు భారత పార్లమెంటు సభ్యుడిగా హైదరాబాదు లోక్‌సభ నియోజకవర్గం నుండి ఎన్నిక య్యాడు. భారత ప్రభుత్వ ప్రతినిధి గా ఆగ్నేయాసియా ప్రాంతీయ ప్రపంచారోగ్య వ్యవస్థాపక మహాసభ, కామన్ వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ లలో పాల్గొన్నాడు. హైదరాబాదు లోని ఐ.ఎన్.టి.యు.సి. శాఖకు అధ్యక్షులుగా కొంతకాలం పని చేశాడు. ఆయన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు. 1916లో స్వదేశీ ఉద్యమంలో మొదటి సారిగా పాల్గొన్నాడు. ఉప్పు సత్యాగ్రహంలో తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం వద్ద, కర్ణాటక రాష్ట్రంలోనూ ఉప్పు తయారుచేసి పోలీసులచే నిర్బంధి తుడై హింసలకు గురయ్యాడు. కరాచీ కాంగ్రెస్ లో హైదరాబాదు ప్రతినిధిగా 1931 లో పాల్గొన్నాడు. హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్ సభ్యుడై 1942లో క్విట్ ఇండియా ఉద్యమం లో పాల్గొన్నాడు. 1947, ఆగస్టు 15 న జాతీయ స్వాతంత్ర్యం సందర్భం గా భారత జాతీయ పతాకాన్ని హైదరాబాదులో ఎగుర వేయటకు ప్రయత్నించి నిజాం ప్రభుత్వం చేత జైల్లో నిర్బంధించ బడ్డాడు. పోలీసు చర్య అనంతరం విడుదలయ్యాడు. ఆయన సతీమణి విమలాబాయి కూడా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది. వీరి మాతృభాష కన్నడం అయినా వీరు ఆంధ్ర దేశానికి చేసిన సేవ గణనీయం. మెల్కోటే 1982 మార్చి 10 వ తేదీన పరమ పదించాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

# విద్యాభివృద్ధికి కృషి చేసిన గొప్ప సంఘ సేవకురాలు సావిత్రిబాయి ఫూలే

**(మార్చి 10 న తొలి తరం మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా)**



చదువు యొక్క ప్రాధాన్యాన్ని వివరించిన గొప్ప సంగ సేవకురాలు ఆమె.విధ్య ద్వారానే సమాజం బాగుపడుతూవుందని నమ్మిన ఉధ్యమకారిని.మహిళల హక్కుల కోసం పోరాటాలే చేసి ప్రపంచం అంతా గర్వించదగిన విలువలు గల తొలి తరం మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే.వీరు 3 జనవరి 1831 న జన్మించారు.వీరు భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి. ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ ఫులే భార్య. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించింది. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు భావించారు.ఆమె మహారాష్ట్ర సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3 న ఒక రైతు కుటుంబంలో జన్మించింది. సావిత్రి బాయి కుటుంబానికి తెలంగాణ ప్రాంతంతో బంధుత్వం ఉంది. వీరి బంధువులు నిజామాబాద్ జిల్లా లో బోధన్ నాందేడ్ కొండల్ వాడి ప్రాంతంలో , అదిలాబాద్ చుట్టుపక్కల ఉన్నరు. బోధన్ ప్రాంతపు మున్నూరుకాపులు వీరికి చుట్టాలు. ఆమె తన 9వ యేట 12 యేండ్ల జ్యోతిరావు పూలెను 1840లో వివాహమాడింది. నిరక్షరాస్యురాలిగా ఉన్న ఆమెకు భర్త జ్యోతిరావు పూలే మొదటి గురువు. జ్యోతీరావు పూలె ప్రోత్సాహంతోనే ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతురాలైంది. అహ్మద్ నగర్ లో ఉపాధ్యాయ శిక్షణ పొంది 1848 లో భర్త జ్యోతిరావుతో కలిసి క్రింది కులాల బాలికల కోసం పూణేలో మొదటి పాఠశాలను ప్రారంభించింది. విఠల్, వాల్వేకర్, దియోరావ్ వంటి ప్రముఖులు పాఠశాల నిర్వహ ణకు సహకరించారు. 1851లో మరల పాఠశాల ప్రారంభించారు. బాలికల చదువు కోసం, విద్యాభి వృద్ధి కోసం సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేసింది. అట్టడుగు వర్గాలు, మహిళలకు చదువు సంపద వంటి సమస్త హక్కులు నిరాకరింపబడిన దేశంలో ఆనాటి సమాజపు కట్టుబాట్లను, బ్రాహ్మణవాద సంప్రదాయాలను, ఆధిపత్యవర్గాలను ధిక్కరించి భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా పాఠశాలలు ప్రారంభించి,12 మే 1848న దేశంలో బహుజనులకు మొట్టమొదటి పాఠశాల ప్రారంభించారు. సమాజంలో ఎన్ని అవమానాలు ఎదురైనా తాను నమ్మిన సిద్ధాంతం కోసం ముందుకు వెళ్లినారు. ఆమె కేవలం 4 సంవత్సరాలలోనే గ్రామీణ ప్రాంతాల్లో 27 పాఠశాలలను ప్రారంభించి ఉచిత విద్యనందించారు. 1848 లోనే దేశంలొ విద్యా ఉద్యమం ప్రారంభించిన మొదటి మహిళ ఉపాద్యాయురాలు .దళితుల, స్త్రీల విద్యా వ్యాప్తికి కృషి ప్రారంభించే నాటికి ఆమె వయస్సు 18 ఏళ్ళు మాత్రమే. వారి జీవితకాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభంచేసి నారు.ఆమె మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్య పరచడానికి 1852లో మహిళా సేవామండల్ అనే మహిళా సంఘాన్ని కూడా స్థాపించింది. జెండర్ సమస్యలకు తోడుగా, కుల పితృస్వామ్య వ్యవస్థల అణచివేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారిత కోసం ఈ సంస్థ కృషిచేసింది. మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినదించినది సావిత్రిబాయి పూలే. 1873 లో తన భర్త మహాత్మా పూలేతో కలసి "సత్యశోధక్ సమాజ్ "ను ప్రారంభించి బాల్యవివాహలకు, మూడనమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతిరేఖంగా, వితంతువు పునఃర్వివాహల కోసం బలమైన ఉద్యమం నడిపారు.తరువాత 1873 సెప్టెంబరు 24న "సత్యసోధక్ సమాజ్" అనే సామాజిక, ఆధ్యాత్మిక సంస్థను ప్రారంభించి, సత్యసోధన కోసం ఉద్యమాన్ని నడిపారు పూలే. ఈ సత్యసోధక్ సమాజ్ మహిళా విభాగం సావిత్రీబాయి నేతృత్వంలో నడిచేది. వివాహాలు వంటి శుభ కార్యాలను పురోహితులు లేకుండా నిర్వహించే విధానాన్ని ఈ సంస్థ ప్రారంభించింది. 1873 డిసెంబరు 25న భార్యను కోల్పోయిన ఒక యువకునికి తన స్నేహితురాలి కుమార్తెతో సత్యసోధక్ సమాజ్ ఆధ్వర్యన సావిత్రీబాయి వివాహం జరిపించారు.1868 నుంచి సావిత్రీబాయి అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారు. 1870లో ఒకసారి 1896లో మరోసారి దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడినప్పుడు పూలే దంపతులు చేసిన కృషి అనన్య సామాన్యం. కరువు వాతపడిన కుటుంబాలలోని అనాధ బాలలను దాదాపు 3,000 మందిని అక్కున చేర్చుకున్నారు. తమ పాటశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించినారు. సావిత్రిబాయి సంఘ సంస్కర్తగానే గాదు, రచయిత్రిగా కూడా నిలిచారు. 1854లోనే ఆమె తన కవితా 'కావ్యపూలే'ను ప్రచురించింది. మరో కవితా సంపుటి 'పావన కాశీ సుభోధ్ రత్నాకర్'ను 1891లో ప్రచురించింది. భర్త జ్యోతీరావుపూలే 1890 నవంబరు 28న మరణించడంతో సావిత్రీబాయి అంతులేని దుఃఖ సాగరంలో మునిగిపోయారు. ఈ దుఃఖంలోనుంచే మరో ఆదర్శానికి శ్రీకారం చుట్టారు. తన భర్తపూలే చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్తసంప్రదాయానికి తెరలేపారు. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇది. పూలే మరణాంతరం సత్యసోధాక్ సమాజ్ భాధ్యతనీ స్వీకరించి నడిపించింది. 1897 లో ప్లేగు వ్యాధి, పూణే నగరాన్ని వణికించింది. నగరమంతా ఎడారిగా మారింది. జనమంతా దగ్గర్లోని అడవుల్లోకి పారిపోయారు. అయినా సావిత్రీబాయి పూలే కొడుకు యశ్వంత్ తోకల్సి వ్యాధిగ్రస్తులకు సేవ చేసారు.189697లో సంభవించిన తీవ్ర కరువు, ప్లేగు వ్యాధి మహారాష్ట్ర జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. ఈ పరిస్థితుల్లో కరువు ప్రాంతాల్లోని దళితులు పేదలకు జోలెపట్టి విరాళాలు సేకరించి అందించారు. ప్లేగువ్యాధి సోకిన పేదలకు దగ్గరుండి సేవలందించారు. 1890వ దశకంలో ప్లేగు వ్యాధి బారినపడిన పిల్లల కోసం వైద్య శిబిరాలు నిర్వహించింది. దుర్భరమైన కరువు పరిస్థితుల్లో కూడా రోజుకు 4 వేల మంది పిల్లలకు భోజనాలు పెట్టించింది. ప్లేగు వ్యాధి సోకిన దళిత కులాలకి చెందిన దళిత చిన్నపిల్లలని తన చంకన వేసుకొని చికిత్స చేసి కాపాడింది. చివరికి ఆ ప్లేగు వ్యాధే ఆమెకి సోకి మార్చి 10, 1897 లో మరణించింది.. సావిత్రి బాయి జయంతిని భారతదేశ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకుంటున్నాము. 1997లో భారత ప్రభుత్వం సావిత్రిబాయి జ్ఞాపకార్థం తపాలా స్టాంపును విడుదల చేసింది. పూణే విశ్వవిద్యాలయానికి సావిత్రిబాయి పేరు పెట్టారు. వీరిని స్పూర్తిగా తీసుకుని ముందుకు పోవాలి. వారి సేవగుణాన్నిమనమందరం స్మరించుకుందాం.ప్రతీ మహిళ వారి ని ఆదర్శంగా తీసుకోవాలి.వారి ఆశయాల సాధనకు కృషి చేయాలి. వారు చూపిన మార్గంలో పయనించు ధాం. వారి వర్ధంతి ని గ్రామ గ్రామాన జ రు పు కు ని వారికి నివాలులు అర్పించుదాం...

కామిడి సతీష్ రెడ్డీ,
జయశంకర్ భూపాలపల్లి జిల్లా
9848445134.
తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
10.03.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews






సంజూ శాంసన్ : ఐపీఎల్‌లో కెప్టెన్

రాజస్థాన్ రాయల్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన తొలి కేరళ క్రికెటర్ సంజూ శాంసన్.

# ప్రగతి ప్రణాళిక సమర్థవంతంగా అమలు చేయాలి

- అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు
- శంషాబాద్‌లో కార్యక్రమం అమలుతీరును పరిశీలించిన కలెక్టర్

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించాలని రంగారెడ్డి కలెక్టర్ సి. నారాయణరెడ్డి అధికారులకు ఆదేశించారు. కార్యక్రమం ఎజెండాలో భాగంగా అభివృద్ధి పనులను కొనసాగిస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సోమవారం జిల్లాలోని శంషాబాద్ మున్సిపల్ పరిధిలో అమలవుతున్న ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని కలెక్టర్ సి. నారాయణరెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా శంషాబాద్‌లోని మున్సిపల్ కమ్యూనిటీ హాల్‌తో పాటు బస్తీ దవాఖానను సందర్శించి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను పరిశీలించారు. బస్తీ దవాఖానకు వచ్చే ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల సరఫరా వివరాలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడ నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, అందిస్తున్న వైద్య సేవలు, మందుల గురించి దవాఖానకు వచ్చిన వారిని కూడా అడిగి తెలుసుకున్నారు. పరీక్షల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ జూన్ 12వ తేదీ వరకు ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో 99 రోజులపాటు కార్యాచరణను అమలు చేయాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను పూర్తిగా పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ శాఖల అధికారులు తమ పరిధిలోని అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేసి దశల వారీగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలోని ప్రతి కార్యాలయంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక పనులు పక్కాగా అమలు కావాలని తెలిపారు. కార్యాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట మరమ్మత్తులు, పెయింటింగ్ పనులు ఉంటే పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని ఆదేశించారు. రోజువారీగా సేకరించిన తడి, పొడి చెత్తను సెగ్రిగేషన్ కేంద్రాలకు తరలించాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా, దోమలు పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట శంషాబాద్ మున్సిపల్ జోనల్ కమిషనర్ చంద్రకళ, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లలితాదేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## పారిశ్రామిక అభివృద్ధితోనే ఉపాధి అవకాశాలు

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ముద్ర, కాప్రా :**

పారిశ్రామిక అభివృద్ధితోనే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ కార్యాలయ సముదాయంలో నిర్వహించిన ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో2026ను సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఎక్స్‌పోలోని వివిధ పారిశ్రామిక స్టాళ్లను సందర్శించారు. స్థానిక పరిశ్రమల అభివృద్ధి, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించే కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. పరిశ్రమలు అభివృద్ధి చెందితే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీఐఎఫ్ అధ్యక్షులు కె. సుధీర్ రెడ్డి, చెర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షులు డి. శ్రీనివాస రెడ్డి, కార్యదర్శి పీ.ఎస్. మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సోమశేఖర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, సంఘ సభ్యులు, స్థానిక ప్రముఖులు ఈ ఎక్స్‌పోలో పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## అన్ని రంగాలలో మహిళలకు పెద్దపీట

- మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

**ముద్ర, కాప్రా :**

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి అన్ని రంగాలలో మహిళలకు పెద్దపీట వేస్తున్నారని ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. మహిళలకు మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సుమారు 50 శాతం వరకు రిజర్వేషన్లు కల్పించి పరిపాలనలో భాగస్వామ్యం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఇదేకాకుండా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ స్వయం సమృద్ధిని సాధించాలనే లక్ష్యంతో వారికి అన్ని రంగాల్లోనూ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. చర్లపల్లి ఆక్స్ఫర్డ్ గ్రామర్ స్కూల్ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు రజిత పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆశా వర్కర్లకు, జీహెచ్ఎంసీ సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రేమలత అగర్వాల్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మౌనిక, ఉపాధ్యాయురాలు సుప్రియ తదితర మహిళలు పాల్గొన్నారు.

## రైల్వే గేట్ ఫ్రీ మల్కాజిగిరిగా తీర్చిదిద్దాలి

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**ముద్ర, మల్కాజిగిరి :**



మల్కాజిగిరి నియోజకవర్గాన్ని రైల్వే గేట్ల సమస్యల నుంచి విముక్తి చేసి “రైల్వే గేట్ ఫ్రీ మల్కాజిగిరి”గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్వే నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై వినతిపత్రాలు అందజేసి సమగ్రంగా చర్చించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించిన ఎమ్మెల్యే, సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోని రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ఆర్‌యూబీలు నిర్మించాలని, మచ్చ బొల్లారం డివిజన్‌లోని రైల్వే బజార్ రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే టన్నెల్ నిర్మాణం చేపట్టాలని కోరారు. రైల్వే స్టేషన్ పరిసరాల్లో వర్షపు నీరు, డ్రైనేజీ నీరు రోడ్లపైకి రావడం వల్ల ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌కే పురం రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే గేట్ వద్ద పాదాచారులు, ప్రయాణికులు సురక్షితంగా వెళ్లేందుకు ప్రత్యేక మార్గం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ అంశాలపై స్పందించిన సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ సానుకూలంగా స్పందించి, త్వరలో సంబంధిత శాఖలతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు కిరణ్, శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, డోలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దత్తాత్రేయ కాలనీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**ముద్ర, కూకట్‌పల్లి :**

దత్తాత్రేయ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కాలనీ వాసుల సమక్షంలో నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ మరియు ఇతర ప్యానెల్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కాలనీ వాసులందరికీ నూతన కమిటీ సభ్యులు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రెండేళ్ల కాలపరిమితిలో కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని అధ్యక్షుడు నాగభూషణం మరియు కార్యవర్గ సభ్యులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కాలనీ అభివృద్ధి కోసం ప్రభుత్వం మరియు అధికారులతో సమన్వయం చేసుకుంటూ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రాధాన్యత క్రమంలో చేపడతామని కమిటీ వెల్లడించింది. ఇందులో భాగంగా కాలనీ అంతటా సీసీ కెమెరాల ఏర్పాటు, ఇంటి నెంబర్లతో కూడిన రోడ్డు నెంబర్ బోర్డుల ఏర్పాటు చేపట్టనున్నట్లు తెలిపారు. కాలనీ వాసుల సహకారంతో ఈ లక్ష్యాలన్నీ త్వరలోనే నెరవేరుస్తామని దత్తాత్రేయ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు.

## కలెక్టరేట్ ఆవరణలో మహిళలకు రంగోలీ

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళలకు రంగోలి, క్యారమ్స్, చెస్, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్ పోటీలను జిల్లా యువజన క్రీడల అధికారి, శిశు సంక్షేమ శాఖ అధికారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొని గెలుపొందిన మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని వారు తెలిపారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

జిల్లాలో ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రజా ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కార్యాలయాల సమావేశ హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో 289 దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు వస్తారని, వారు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడం అధికారుల బాధ్యత అని అన్నారు. ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా చదివి, అందులో పేర్కొన్న సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని అవసరమైన విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత కాలంలో పరిష్కరించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలు, ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్, డీపీఓ, అటవీ శాఖ, డీఆర్‌డీఏ, వ్యవసాయ శాఖ, ప్రణాళిక శాఖ, గనుల శాఖ, భూ సేకరణ తదితర శాఖల జిల్లా అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. వారంలోపు అన్ని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, గత వారం అందిన దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించినవి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి వంటి పూర్తి వివరాలతో సమగ్ర నివేదికను నమూనా ప్రకారం సమర్పించాలని సూచించారు. అనంతరం 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, రెవెన్యూ అదనపు కలెక్టర్ రాజేశ్వరి, జడ్పీ సీఈఓ సుధీర్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

### ప్రజావాణికి 14 ఫిర్యాదులు..

**ముద్ర, నారాయణపేట** : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి 14 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా నారాయణపేట కలెక్టర్‌గా వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను ప్రభుత్వం నియమించినప్పటికీ ఇప్పటివరకు ఆయన విధుల్లో చేరలేదు. దీంతో జిల్లా పాలనాపరంగా కొంత జాప్యం ఏర్పడుతోంది.

### అర్జీలకు సత్వర పరిష్కారం..

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :** ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు సమర్పించిన అర్జీలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 19, ఇతర శాఖలకు చెందినవి 80, మొత్తం 99 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణిలో కాలనీ వాసుల మొర

**ముద్ర, శేరిలింగంపల్లి :** మియాపూర్ సర్కిల్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డీసీ శశిరేఖతో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సమీక్ష నిర్వహించారు. మియాపూర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీల వాసులు తమ సమస్యలను ప్రజావాణిలో వినిపించారు. తాము అనేక సంవత్సరాలుగా కాలనీలో నివాసం ఉంటున్నప్పటికీ కనీస వసతులు లేవని, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తక్షణమే మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ కాలనీ వాసుల నుండి వచ్చిన వినతిపత్రాలను పరిగణలోకి తీసుకుని అత్యవసర పనులపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు డీఈ శ్రీదేవి, ఏఈలు ప్రశాంత్, ప్రతాప్, మాజీ కౌన్సిలర్ రఘుపతి రెడ్డి, నాయకులు రఘునాథ్ రెడ్డి, ఎర్రగడ్ల శ్రీనివాస్ యాదవ్, అక్బర్ ఖాన్, పోషయ్య, తిరుపతి, నరేందర్ బల్లా, సందీప్ రెడ్డి, యశ్వంత్ రెడ్డి, రాహుల్ పాల్గొన్నారు.

## ఘనంగా ఇఫ్తార్ విందు

**ముద్ర, కూకట్‌పల్లి :**

మత సామరస్యానికి ప్రతీకగా మూసాపేటలోని జనతా నగర్‌లో కాంగ్రెస్ నాయకుడు సలీం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందూ, ముస్లింలు సోదరభావంతో మత సామరస్యాన్ని చాటుతూ పండుగలను జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాలి బాలాజీ, సత్యం శ్రీరంగం, శేరి సతీష్ రెడ్డి, తూము వేణు, సంజీవరావు, గంధం రాజు, తూము మనోజ్ కుమార్, ప్రవీణ్, కృష్ణ రాజ్‌పుత్, సాయిబాబా చౌదరి, పొడుగు అప్పారావు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



**ముద్ర, తాండూరు :**

తాండూరు మండలం అంతారం రైతు వేదికలో ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ వారి ఆధ్వర్యంలో సోమవారం నియోజకవర్గంలోని 108 మంది లబ్ధిదారులకు (రైతులకు) సబ్సిడీ స్ప్రింక్లర్ యూనిట్ లను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి రైతు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్కుల పంపిణీ

**ముద్ర న్యూస్ :**

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థుల వైద్య విద్యకు అయ్యే ఫీజుల కోసం ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. మొత్తం 15 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు దాదాపు రూ.10 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యను ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రభుదాస్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గంధం నాగేశ్వర్ రావు, చర్లపల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నేమూరి మహేష్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

**ముద్ర, మల్కాజిగిరి :**

వీకెండ్ సందర్భంగా మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో మొత్తం 321 మంది మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. వాహనాల వారీగా కేసుల వివరాలు ఇలా ఉన్నాయి. రెండు చక్రాల వాహనాలు 249, మూడు చక్రాల వాహనాలు 11, నాలుగు చక్రాల వాహనాలు 59, భారీ వాహనాలు 2 ఉన్నాయి. వీరిని న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నారు. గత వారం 1వ తేది నుంచి 7 వరకు కోర్టులో మొత్తం 228 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పరిష్కరించబడ్డాయి. అందులో ఐదు మందికి జరిమానాతోపాటు జైలు శిక్ష, 10 మందికి జరిమానాతోపాటు సామాజిక సేవ, 213 మందికి జరిమానా మాత్రమే విధించబడ్డాయని మల్కాజిగిరి కమిషనరేట్ డీసీపీ వెల్లడించారు.

## మానసిక స్థైర్యంతో లక్ష్యాన్ని సాధించాలి

### దివ్యాంగులకు కలెక్టర్ మనోధైర్యం

**ముద్ర, మేడ్చల్ జిల్లా ప్రతినిధి :**



దివ్యాంగులకు ప్రభుత్వం అందించే ట్రైసైకిళ్లు, వీల్ సైకిళ్లను సరైన విధంగా వినియోగించుకొని జీవితంలో ఆర్థికంగా ఎదగాలని, అందుకు అవసరమైన మార్గనిర్దేశం, సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం ఎల్లవేళలా ముందుంటుందని మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. సోమవారం అల్వాల్‌లోని సఖీ సెంటర్‌లో జిల్లా మహిళా, శిశు వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దివ్యాంగులకు 56 ట్రై సైకిళ్లు, 14 వీల్ సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ మను చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్, ఆర్డీవో ఓం ప్రకాష్, అల్వాల్ తహసీల్దార్ రాములు, డీడబ్ల్యూవో శారద తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు శారీరకంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ మానసికంగా ధైర్యంగా ఉండి తమ లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. అందుకు అవసరమైన సహాయ సహకారాన్ని తప్పకుండా అందిస్తామని తెలిపారు. మానసికంగా ధైర్యంగా ఉంటే అవకలనం అడ్డంకి కాదని, అన్ని రంగాలలో దివ్యాంగులు రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్‌తో కలిసి కలెక్టర్ దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, వీల్ చైర్లు పంపిణీ చేశారు. కలెక్టర్ సఖీ సెంటర్‌ను పరిశీలించి అక్కడి ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 10.03.2026
www.mudranews.in | @mudranews



**సంజూశాంసన్**

చిన్న వయసులోనే ఐపీఎల్ సెంచరీ



ఐపీఎల్‌లో అతి చిన్న వయసులో సెంచరీ చేసిన భారత ఆటగాళ్లలో సంజూ ఒకడు.

# తాగు నీటి సమస్య రాకుండా కృషి చేద్దాం

**- మంత్రి పొన్నం ప్రభాకర్**

**- చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో సన్నాహక సమావేశాలు**



**ముద్ర, కరీంనగర్:** గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా కృషి చేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సోమవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక అమలుకు సంబంధించి నిర్వహించిన సన్నాహక సమావేశాలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక ద్వారా గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమం అమలులో చిగురుమామిడి, సైదాపూర్ మండలాలను రాష్ట్రంలో నంబర్ వన్‌గా నిలపాలని పేర్కొన్నారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. పనులను వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులకు గృహప్రవేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు. గ్రామాల్లో పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. విద్యార్థులను ప్రైవేటు పాఠశాలలకు పంపని గ్రామాల్లో ఎంత పెద్ద పనైనా చేసి పెడతానని హామీ ఇచ్చారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రతి వ్యక్తికి హెల్త్ ప్రొఫైల్ రూపొందించి, వారి ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యం బాగుంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.

చిగురుమామిడి సమావేశంలో కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను విజయవంతం చేస్తామని తెలిపారు. గ్రామాల వారీగా తాగునీటి సమస్య రాకుండా మిషన్ మోడ్‌లో పనిచేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజ యవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, ఆర్డీవో కే.మహేశ్వర్, డీపీఓ జగ దీశ్వర్, డీఆర్‌డీఓ శ్రీధర్, జిల్లా వైద్యాధికారి వెంకట రమణ, సంక్షేమ అధికారి సరస్వతి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అన్ని నగరాలను సమానంగా చూడాలి

**- కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్**



**ముద్ర, కరీంనగర్:** రాష్ట్ర ప్రభుత్వం అన్ని నగరాలను సమా నంగా చూడాలని కరీంనగర్ మాజీ మేయర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అమలు చేస్తున్న వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేసి, మిగతా పట్టణాలను విస్మరించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాసి ప్రభుత్వ తీరుపై అసం తృప్తి వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలపై ఈ నెల 31 వరకు 90 శాతం రాయితీతో పాటు 5 శాతం వడ్డీ మినహాయిస్తూ ఓటీఎస్ పథకాన్ని అమలు చేస్తుండటం స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ పథకాన్ని రాష్ట్రంలోని ఇతర మున్సిపల్ కార్పొరేషన్లకు వర్తింపజేయకపోవడం అన్యాయమని విమర్శించారు. కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో సుమారు 85 వేల ఇళ్లకు పైగా ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయని తెలిపారు. జీహెచ్‌ఎంసీ మాదిరిగా ఓటీఎస్ పథకాన్ని కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో కూడా అమలు చేస్తే వేలాది కుటుంబాలకు ఉపశమనం కలుగుతుందన్నారు. ఒక నగరానికి మాత్రమే ప్రత్యేక రాయితీలు కల్పిస్తూ మిగతా పట్టణాలను పక్కన పెట్టడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందన్నారు. జీహెచ్‌ఎంసీ కి ఒక న్యాయం, కరీంనగర్‌కు మరో న్యాయమా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాలకు ఓటీఎస్ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు.

## గోదావరి పుష్కరాలు అత్యంత ప్రతిష్టాత్మకమైన వేడుక



**ముద్ర, ధర్మపురి:** రాబోయే గోదావరి పుష్కరాలు రాష్ట్రానికి అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆధ్యాత్మిక వేడుక అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. సోమవారం ఈవో కార్యాలయంలో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 2027లో జరగనున్న పుష్కరాలకు దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారని తెలిపారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పుష్కరాలకు అవసరమైన భూముల సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి కోరారు.

## అన్ని వర్గాల అభివృద్ధికి కృషి



**ముద్ర, జగిత్యాల:** రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. కోరుట్ల మండలంలోని ధర్మారం గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ. 12లక్షల నిధులతో నిర్మించిన అంగన్ వాడీ భవనాన్ని జువ్వాడి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యానికి పెద్ద పీట వేస్తుందని, దీనిలో భాగంగాగానే ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. అర్హులైన పేద మధ్య తరగతి ప్రజలకు ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు మంజూరు చేశారని, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియాన్ని పంపిణీ చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200ల యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, రైతు రుణమాఫీ వంటి పథకాలను అమలు చేసిన ఘనత రేవంత్ ప్రభుత్వానిదే అన్నారు. కాగా ధర్మారం గ్రామ ప్రభుత్వ పాఠశాల మరమ్మతులకు గాను రూ. 3లక్షల నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దోడ రంజిత్ రెడ్డి, కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, వైస్ చైర్మన్ వెంకటేష్ గౌడ్, స్థానిక ఉప సర్పంచ్ గణేష్, మల్లాపూర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుష్పాలత నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

# మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

**- గల్ఫ్ బాధితులకు అండగా ఉంటాం**


**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, ధర్మపురి:** రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. సోమవారం ధర్మపురి పట్టణ కేంద్రంలోని షాదీ ఖానాలో మైనార్టీ సం క్షేమ శాఖ ఆధ్వర్యంలో ముస్లిం మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జగిత్యాల జిల్లాలో 590 మంది మహిళలు కుట్టు మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. జిల్లా లో మైనార్టీ రుణాల కోసం అర్హులు దర ఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబం ధిత శాఖ మంత్రి తో మాట్లాడి రుణాలు దించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**'ప్రజా పాలన' విజయవంతం చేయాలి..**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ముఖ్యంగా పారిశుధ్యం అంశంతో పాటు పెండింగ్ ఫైళ్ల అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. 99 రోజుల ప్రణాళికలో సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని సూచించారు.



ప్రభుత్వం గల్ఫ్ బాధితులకు అండగా నిలుస్తుందని తెలిపారు. దేశాల్లో జరిగిన ప్రమాదంలో మరణిస్తే వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నా రన్నారు. గల్ఫ్ బాధితులను ఆదుకో వడా నికి ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ. 5 లక్షలు అందజేస్తుందని చెప్పారు.

కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రజా పాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్తున్నారాని ప్రమాదవశాత్తు అక్కడ మరణిస్తే కుటుంబం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గల్ఫ్ బాధితులకు ఆదుకోవడానికి జిల్లాలో ఇప్పటి వరకు 250 మందికి రూ. 5 లక్షలు అందజేశామని పేర్కొన్నారు. ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మార్కెట్ కమిటీ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## రామగుండంను ఆదర్శంగా నిలపాలి



**ముద్ర, గోదావరిఖని:** రామగుండంను అభివృద్ధిలో ఆదర్శంగా నిలపాలని స్థానిక ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 5కే రన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం నగరపాలికను చెత్త రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ రన్‌లో మేయర్ మహంకాళి స్వామితో పాటు పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

# సామాన్యులపై భారం మోపుతున్న కేంద్రం

**- సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొప్పుల శంకర్**



**ముద్ర, కరీంనగర్:** అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరగకుండానే కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై భారం మోపుతుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొప్పుల శంకర్ ఆరోపించారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట గాంధీ చౌక్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ ధరల పెంపు అనేది కేవలం ఆర్థిక భారం మాత్రమే కాదు. ఇది ప్రజల జీవన ప్రమాణాలపై చేస్తున్న ప్రత్యక్ష దాడి అని అన్నారు. గృహ వినియోగ సిలిండర్‌పై రూ.60, వాణిజ్య సిలిండర్‌పై రూ.115 పెంచడంతో సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. పెంచిన వంట గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. గ్యాస్ సబ్సిడీని పునరుద్ధరించి వినియోగదారుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించేవరకు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాము పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ నిరసనలో సీపీఎం పట్టణ కార్యదర్శి సతీష్, మండల కమిటీ సభ్యుడు సదానందం, వడ్లూరి కిషోర్, రమేష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

**ముద్ర, నిర్మల్:** నిర్మల్ పట్టణంలోని గోల్డెన్ ఫంక్షన్ హాల్ వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. మంజులాపూర్‌కు చెందిన సృజన్(33), నటరాజ్ నగర్‌కు చెందిన పృథ్విరాజ్(34) ద్విచక్ర వాహనంపై మంజులాపూర్ నుంచి నిర్మల్ వైపునకు వెళ్తున్నారు. వారు ప్రయాణిస్తున్న బైక్ ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఉత్తమ పౌరులుగా చేయడమే ధ్యేయం



**ముద్ర, ఆదిలాబాద్:** విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది దేశానికి అందించడమే తమ ధ్యేయమని తెలంగాణ 32 బెటాలియన్ ఉమ్మడి జిల్లా కమాండెంట్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ వీపీ సింగ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో సోమవారం శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ తరగతుల్లో ఆపద మిత్ర అంశంపై పది రోజుల పాటు ప్రకృతి విపత్తులపై అవగాహన కల్పించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపద సమయంలో దేశానికి రెండో సైన్యంగా ఎన్‌సీసీ సేవలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌వో గాలి అశోక్, క్యాడెట్లు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 10-03-2026
www.mudranews.in | @mudranews



**సంజూశాంసన్ : వికెట్ కీపర్ + బ్యాట్స్‌మన్**

అతను వికెట్ కీపర్ కూడా, టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ కూడా. రెండు పాత్రలను సమర్థంగా నిర్వహిస్తాడు.





## వంటగ్యాస్ ధరలను తగ్గించాలి

ముద్ర, మోత్కూరు:

దేశంలో సరిపడా చమురు, గ్యాస్ నిల్వలు ఉన్నాయని కొరతలేదని చెప్తూనే గ్యాస్ ధరలు పెంచి పేద ప్రజలపై భారం వేయడం సరికాదని, పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి డిమాండ్ చేశారు. సోమవారం గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ మోత్కూర్ మండలం పాలడుగు గ్రామంలో వలిగొండ తొర్రూర్ ప్రధాన రహదారిపై గ్యాస్ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గృహ అవసరాలు, వాణిజ్య సిలిండర్లపై ధరల పెంపును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఉజ్వల పథకం లబ్ధిదారులను కూడ వదలి పెట్టకుండా గృహ అవసరాల గ్యాస్ వినియోగదారులపై రూ. 60ల పెంపు క్రూరమైనదని విమర్శించ్చారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్ పై రూ 114.50 పైసలు పెంపుతో ప్రజలపై భారం పడుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, శాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య, వెండి యాదగిరి, చింతకింది సోమరాజు, దడిపల్లి నవనీత, మాదవి, కొంపల్లి రాజేశ్వరి, దడిపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్ఎల్ఎన్ఎస్ కళాశాలలో
## అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ముద్ర ప్రతినిధి, భువనగిరి:

పట్టణంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ న్యాయవాది ఎర్రం లక్ష్మి విచ్చేసి మాట్లాడారు. మహిళలు పురుషులతో సమానమని, మహిళలు అన్ని రంగాల్లో విజయాన్ని సాధించాలని, ప్రతి పనిలో పురుషులతో సమానంగా ముందుండాలని, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో మంచి విజయాలు అందుకొని ముందుకు సాగాలని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ మహిళ లెక్చరర్లు, అతిథులు, మహిళా సిబ్బందిని శాలువాలతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు తోటకూరి రామకృష్ణ, కనక బాలరాజు, ఎండీ అత్తరు ఫరీన్, కూరపాటి స్రవంతి, వల్లస్ అలివేలు, లెక్చరర్లు ఎన్ సుధా, సుమలత, సరిత, సంధ్య విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

### కన్నుల పండువగా
## శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**- అగ్నిగుండాలలో అపశృతి.. ఇద్దరికీ గాయాలు..**



ముద్ర, మోత్కూరు:

మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. సోమవారం బ్రహ్మోత్సవాలలో భాగంగా అగ్నిగుండాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఒకేసారి అగ్నిగుండాలు తొక్కే క్రమంలో ఇద్దరు వ్యక్తులు అగ్నిగుండాలలో పడిపోవడంతో గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని ఆసుపత్రికి తరలించారు.

### మజ్జిగ పంపిణీ

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ఎన్ఆర్ఐ యలగందుల సుజన-వేణుధర్ దంపతుల సౌజన్యంతో ఆలయం వద్ద భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుండగోని రామచంద్రు గౌడ్, సభ్యులు రవింద రాయుడు, బయ్యని రాజు, గుండు శీను భక్తులు పాల్గొన్నారు.



## తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

**- కలెక్టర్ అనురాగ్ జయంతి**

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

రానున్న వేసవి సీజన్ ను దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగానే ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. సోమవారం మినీ మీటింగ్ హాల్ లో జిల్లాలో మంచి నీటి సరఫరా పై ఆర్ డబ్ల్యుయస్, మిషన్ భగీరథ, హెచ్ యం డబ్ల్యు యస్, యస్ ఈ పబ్లిక్ హెల్త్ సంబంధిత శాఖల అధికారులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావుతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మల్లన్న సాగర్ నుండి ఘన్ పూర్ వరకు 210 కోట్లతో మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ తాగునీటి



సరఫరాకు అంతరాయం తలెత్తకుండా అంకితభావంతో పని చేయాలని, నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. నీటి ఎద్దడి నెలకొనేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలలో ప్రత్యామ్నాయ వనరుల ద్వారా నీటిని సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే, తక్షణమే స్పందించి చర్యలు చేపట్టే విధంగా అధికారులను, క్షేత్ర స్థాయిలో సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ యస్ ఈ కృష్ణయ్య, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కరుణాకరన్, యస్ ఈ పబ్లిక్ హెల్త్ వెంకటేశ్వర్లు, హెచ్ఎండబ్ల్యూఎస్ బి జి యం శశాంక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



### ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 46 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు.

అందులో రెవిన్యూ శాఖ 24, గ్రామీణాభివృద్ధి శాఖ 5, మున్సిపాలిటీ 4, హౌసింగ్ 2, సూపరింటెండెంటెంట్ ఆఫ్ పోలీస్ 2, డివిజనల్ పంచాయతీ 2, సర్వే ల్యాండ్, జిల్లా సంక్షేమ , యస్ డి సి, ఈఈ ఇరిగేషన్, ఆర్ టిసి, విద్యా, రోడ్లు, భవనాలు శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీ సి.ఈ.ఓ శోభరాణి గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ రైతుల ప్రయోజనాలే పరమావధి

**- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**- బస్వపూర్ రిజర్వాయర్ నుండి నీరు విడుదల**



ముద్ర ప్రతినిధి, భువనగిరి:

భువనగిరి నియోజకవర్గ రైతుల ప్రయోజనాలే పరమావధి అని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం బస్వపూర్ రిజర్వాయర్ నుండి కాలువల ద్వారా చెరువులకు ఎమ్మెల్యే నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రక్రియలో హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై యుద్ధ ప్రాతిపదికన కల్వర్టు నిర్మించి నీటి మళ్లింపును సుగమం చేసినట్లు తెలిపారు. దీని ద్వారా భువనగిరి మండలంలోని పలు గ్రామాలు రాంచంద్రపురం, రామకృష్ణపురం, చందుపట్ల, బండ సోమరం, గౌస్ నగర్ చుట్టుపక్కల గ్రామాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నిధుల మంజూరు నుండి కల్వర్టు నిర్మాణం పూర్తి చేసే వరకు పనులను దగ్గరుండి పర్యవేక్షించిన ఎమ్మెల్యేకు పలువురు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



### మల్లికార్జున స్వామి కళ్యాణం

భువనగిరి పట్టణంలోని తారకరామ నగర్ లో జరిగిన శ్రీ మల్లన్న స్వామి కళ్యాణంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు, మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, వార్డ్ కౌన్సిలర్ తుమ్మటి పాండు, బర్రె సంఘవీ కర్ణాకర్, సోమయ్య వార్డ్ ప్రజలు పాల్గొన్నారు.

### ఆధునిక నైపుణ్యాలను
## యువత పెంపొందించుకోవాలి




**- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

ముద్ర, వరంగల్:

ప్రస్తుత కాలంలో యువత ఆధునిక నైపుణ్యాలు పెంపొందించు కోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. సోమవారం ములుగు రోడ్డులోని వరంగల్ ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగ యువతకు ఉపాధి నైపుణ్యాలను పెంపొందించే ఆరు అధునాతన కోర్సుల ఉచిత శిక్షణ కార్యక్రమాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిగ్రీలు ఉంటే సరిపోదని ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు ఉంటేనే ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిల బడగలరన్నారు. అనంతరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ మంగునూరి చందర్ మాట్లాడుతూ అధునాతన కోర్సులలో ఉచిత శిక్షణ కోసం అభ్యర్థులు ములుగురోడ్‌లో ఉన్న వరంగల్ ప్రభుత్వ ఐటీఐ కార్యాలయంలో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఐటీఐ ప్రిన్సిపల్ సక్రు, కాజీపేట ఐటీఐ ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, కార్యాలయాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారంలో
## సమన్వయంతో పని చేయాలి

**- మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి**

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

భువనగిరి పురపాలక సంఘ పరిధిలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అందరూ సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి సూచించారు. సోమవారం పట్టణంలోని 4, 11, 16, 17, 35 వార్డులలో ఆమె ప్రారంభించారు. ఉదయం 6 గంటలకు స్థానిక వినాయక చౌరస్తా నుండి పాత బస్టాండ్ మీదుగా వినాయక చౌరస్తా వరకు వరకు 5కే రన్ నిర్వహించగా వైస్ చైర్ పర్సన్ పోతంశెట్టి మంజుల, స్థానిక గౌరవ వార్డు సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. 35వ వార్డులో పందుల సమస్యను నివారించుటకుగాను పందుల పెంపకందారులు తమ పందులను శివారు ప్రాంతాలకు తరలించాలని తెలిపారు..






## కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్ కు ఆత్మీయుల సన్మానం

ముద్ర, మోత్కూరు:

మోత్కూర్ మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన 9వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్ ను స్థానిక వార్డు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్ చిలువేరు అభిగౌడ్ ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీకాంత్ గౌడ్ గెలుపునకు సహకరించిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామెల్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి లకు అభి గౌడ్ సెల్ ఫోన్ ద్వారా ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట జనగాం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో టిప్పర్ దగ్ధం

ముద్ర, నల్లగొండ:

నల్లగొండ జిల్లా చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ టిప్పర్ దగ్ధమైంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం బంగారిగడ్డ నుండి నాంపల్లి వరకు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా టిప్పర్లు మట్టి తరలిస్తున్నాయి. సోమవారం గ్రామ శివారులో మట్టి అన్‌లోడ్ చేస్తూ డ్రైవర్ ట్రాలీ కిందకు దింపకుండానే పైన ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్‌ను గమనించకుండా టిప్పర్‌ను ముందుకు తీసుకురావడంతో కరెంట్ వైర్లు తగిలి మంటలు అంటుకుని టిప్పర్ పూర్తిగా దగ్ధమైంది. డ్రైవర్ బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నప్పటికీ కరెంట్ షాక్‌తో కాళ్లు, కడుపు భాగంలో తీవ్రంగా గాయాలు కావడంతో నల్లగొండలోని ఆసుపత్రికి తరలించారు. గ్రామస్తులు ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 10.03.2026
www.mudranews.in | @mudranews



**సంజూశాంసన్**

**అగ్రెసివ్ బ్యాటింగ్ స్టైల్**

సంజూ బ్యాటింగ్ స్టైల్ చాలా అటాకింగ్‌గా ఉంటుంది. స్పిన్, ఫాస్ట్ బౌలింగ్ రెండింటినీ సమానంగా ఎదుర్కో గలడు.



# పంట వివరాలు కచ్చితంగా నమోదు చేయాలి

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలంటే పంట వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ వ్యవసాయ అధికారులకు సూచించారు. మే 10 లోపు అన్ని పంటల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. సోమవారం కొల్చారం మండలం అప్పాజీ పల్లిలో పంట నమోదు యాప్ పనితీరును క్షేత్రస్థాయిలో కలెక్టర్ పంట పొలాలకు వెళ్లి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పంటల నమోదుకు వ్యవసాయ శాఖ గ్రామ స్థాయిలో ప్రైవేట్ సర్వేయర్ల ద్వారా డిజిటల్ పంట సర్వేకి శ్రీకారం చుట్టింది. జియో-రిఫరెన్స్ చేయబడిన కాడాస్ట్రల్ మ్యాప్లు వున్న గ్రామాలలో ప్రయివేట్ సెర్వేయర్లు కేంద్ర ప్రభుత్వం యాప్ లో పంట నమోదు చేస్తారని తెలిపారు. కాడాస్ట్రల్ మ్యాప్ అందుబాటులో లేని గ్రామాలలో మండల వ్యవసాయ అధికారులు రాష్ట్ర ప్రభుత్వ యాప్ లో పంట నమోదు చేస్తారన్నారు. జిల్లాలో 2,85,774 ఎకరాలకు గాను ఇప్పటి వరకు 39,827 ఎకరాలు నమోదు చేసినట్లు తెలిపారు. వెంట జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, ఏఈఓలు, రైతులున్నారు.



యాప్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతిమా సింగ్

## జిల్లా జడ్జిని కలసిన కలెక్టర్



**ముద్ర ప్రతినిధి, మెదక్:**

జిల్లా జడ్జి నీలిమను కలెక్టర్ ప్రతిమా సింగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అభివృద్ధి, న్యాయ పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ప్రజలకు వేగంగా న్యాయ సేవలు అందించేందుకు పరిపాలన, న్యాయ వ్యవస్థ పరస్పర సహకారంతో పనిచేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సేవల మెరుగుదలకు తీసుకుంటున్న చర్యల గురించి కలెక్టర్ వివరించారు.

# అంగన్వాడీల బలోపేతానికి కృషి

- ఐసీడీఎస్ డైరెక్టర్ శృతి ఓజా

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



అంగన్వాడీలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఐసీడీఎస్ డైరెక్టర్ శృతి ఓజా తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలోని బాలల సదనం, సఖీ కేంద్రం, నర్సాపూర్ రెడ్డిపల్లి అంగన్వాడీ సెంటర్ ను సోమవారం సందర్శించారు. అనంతరం కలెక్టర్ ప్రతిమా సింగ్ తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో కనీస సౌకర్యాలు విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీరు ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో సఖి కేంద్రం సిబ్బందితో సమీక్షించారు. డీవీ కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలసదనం నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని సందర్శించి 99 రోజుల్లో పూర్తి చేసే దిశగా కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకోవాలని ఆదేశించారు. బాలసదనం పిల్లల సంరక్షణ, పోషకాహారం అందించి బలాన్ని పెంచాలని ఆదేశించారు. పోషకాహార సేవలను బలోపేతం చేయడం, అంగన్‌వాడీ మౌలిక సదుపాయాలను పర్యవేక్షించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని సంక్షేమ శాఖ పనితీరు ఆదర్శంగా ఉందని అంగన్వాడీడి సెంటర్స్, సఖి సెంటర్లలో మెరుగైన సేవలు అందుతున్నాయని చెప్పారు. వెంట డీడబ్ల్యువో హేమ భార్గవి, సీడీపీవోలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:**

చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హత్నూర గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు వారు ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడుతూ పిల్లలు, మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండటం చాలా అవసరమని తెలిపారు. బాలలపై లైంగిక నేరాలను అరికట్టేందుకు అమలులో ఉన్న పోక్సో చట్టం కింద కఠిన శిక్షలు విధించబడుతున్నాయని వివరించారు. అలాగే గృహహింస చట్టం ద్వారా మహిళలకు చట్టపరమైన రక్షణ లభిస్తుందని తెలిపారు. సోషల్ మీడియా వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ వేధింపులు, ఆన్‌లైన్ మోసాలు వంటి సమస్యల నుంచి మహిళలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎలాంటి అన్యాయం జరిగినా మహిళలు భయపడకుండా చట్టపరమైన సహాయం పొందాలని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్యులను కోరారు. ఈ కార్యక్రమంలో హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# రుణాల లక్ష్య సాధనకు కృషి చేయాలి

**ముద్ర, సంగారెడ్డి:**




జిల్లాలో ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరును పెంచేందుకు బ్యాంకులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ ఆర్.డి. మాధురి సూచించారు. డిసెంబర్ 2025 త్రైమాసికానికి సంబంధించిన జిల్లా సంప్రదింపుల కమిటీ(డీ సీసీ), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డీఎల్ఆర్సీ) సమావేశాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. సమావేశానికి జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నర్సింగ్ రావు సమావేశాన్ని సమన్వయం చేశారు. ఈ సమావేశానికి ఆర్బీఐ ఏజీఎమ్ శ్రీనివాస్ వెన్న, నాబార్డ్ ఏజీఎమ్ /డి డి కృష్ణతేజ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ సిద్దిపేట శ్రీనివాస్, జిల్లా పరిషత్ సీఈవో జానకిరెడ్డి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జా నాయక్, జిల్లా అధికారులు, అన్ని బ్యాంకుల కంట్రోలర్లు హాజరయ్యారు. సమావేశంలో డిసెంబర్ 2025 త్రైమాసికానికి సంబంధించిన బ్యాంకింగ్ కార్యకలాపాలపై జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వివరాలు సమర్పించారు. జిల్లాలో పంట రుణాల లక్ష్యం రూ.2244.72 కోట్లకు గాను 65.93 శాతం, మొత్తం వ్యవసాయ రుణాల లక్ష్యం రూ.4232.98 కోట్లకు గాను 62.97 శాతం, మొత్తం అడ్వాన్సులు రూ.16082.57 కోట్లకు గాను 68.89 శాతం సాధించినట్లు తెలిపారు.అదే విధంగా విద్యా రుణాలు, గృహ రుణాలు, ఎంఎస్ఎంఈ రుణాలు, స్వయం సహాయక సంఘాల రుణాలు తదితర రంగాల వారీగా లక్ష్యాలు, సాధించిన ప్రగతిపై సమావేశంలో చర్చించారు. ఆర్బీఐ ఏజీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంకులకు కేటాయించిన గ్రామాల్లో ప్రధానమంత్రి జనసురక్ష పథకాలు , పీఎంజెజెబివై , పీ ఎంఎస్ బి వై, ఏపివైపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఎక్కువ మంది లబ్ధిదారులను నమోదు చేయాలని సూచించారు. రీకేవైసీ ప్రక్రియను పూర్తి చేయడం, నిర్విరామంగా ఖాతాలను నిర్వహించుకోవడం గురించి వినియోగదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నాబార్డ్ ఏజీఎం కృష్ణతేజ మాట్లాడుతూ వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి, కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ), పశుసంవర్ధక, మత్స్యరంగ రుణాల కింద అర్హులైన లబ్ధిదారులకు మరింతగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు.

## 13న సంగారెడ్డిలో జాబ్ మేళా

**ముద్ర, సంగారెడ్డి:**

తెలంగాణ రాష్ట్ర డిజిటల్ ఎంప్లాయ్మెంట్ ఎక్స్చేంజ్ ఆధ్వర్యంలో ప్రముఖ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా ట్రాక్టర్ తయారీ యూనిట్, జహీరాబాద్ లో ఉద్యోగాల భర్తీ కోసం ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జానాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 13న ఉదయం 9 గంటల వరకు సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, హనుమాన్ నగర్, ఇస్మాయిల్ ఖాన్ పేట్ లో జాబ్ మేళా నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళా ద్వారా 800కు పైగా ఖాళీలను ట్రెయినీ మరియు అప్రెంటిస్ పోస్టుల ద్వారా భర్తీ చేయనున్నారని వెల్లడించారు. ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని కోరారు. అర్హత కలిగిన యువత తమ విద్యా ధ్రువ పత్రాలు, ఆధార్ కార్డు, బయోడేటా, ఇతర అవసరమైన ధ్రువ పత్రాలతో జాబ్ మేళాకు హాజరుకావాలని పేర్కొన్నారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తం

**ముద్ర, మెదక్:**

సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్ సూచించారు. మెదక్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళా శాలలో సోమవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో ఆయ న మాట్లాడారు. సైబర్ స్టాకింగ్, బులీయింగ్ వంటి సమస్యలపై వివరించి విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. సోషల్ మీడియాలో అపరిచితులతో పరిచయాలు పెంచు కోవడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలను వివరించారు. నకిలీ సోషల్ మీడియా ప్రొఫైల్‌ల ద్వారా జరిగే మోసాలు, మ్యాట్రిమోనియల్ మోసాలు, ఇతర ఆన్‌లైన్ మోసాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం సైబర్ నేరాల నివారణపై అవగాహన ప్రతిజ్ఞ చేయించి, అవగాహన పోస్టర్‌ను ప్రదర్శించారు.

# పన్నులు పెంచే ప్రసక్తే లేదు

- మెదక్ అభివృద్దే ధ్యేయం
- మున్సిపల్ మొదటి సమావేశంలో ఎమ్మెల్యే రోహిత్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



టాక్స్ లు పెంచే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. సోమవారం మెదక్ పురపాలక సంఘం మొదటి సర్వసభ్య సమావేశం చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతిరాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రోహిత్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు ముఖ్యం, ఆదాయ వనరులు వేరే రకంగా సమకూర్చుకోవాన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, దోమలు, ఈగలు నివారణ, శానిటేషన్ పై దృష్టి పెట్టాలన్నారు. 70 శాతం కొత్త వారు కౌన్సిలర్లుగా ఎన్నికైనందున అధికారులతో పరిచయం, శిక్షణ ఇప్పించాలన్నారు. పార్టీలకతీతంగా మెదక్ నియోజకవర్గం, మెదక్ పట్టణం అభివృద్ధి చేసుకుందామని అన్నారు. మిషన్ భగీరథ కాళేశ్వరం, పేరుతో బీఆర్ఎస్ మోసం చేసిందన్నారు. నేడు మళ్లీ తాగునీటి సమస్య పరిష్కారం కోసం వాటర్ ట్యాంకులు పెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్లాంట్ ఏర్పాటు కోసం ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని కమిషనర్ కు సూచించారు. స్వీపింగ్ మిషన్ వాడాలని, మరమ్మతులంటే చేయించాలని తెలిపారు. సీసీ రోడ్లకు ప్రాముఖ్యత ఇచ్చి వార్డులో నిర్మించాలన్నారు. కౌన్సిలర్లు సభ దృష్టికి తెచ్చిన అంశాలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

తతఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ కొత్తగా గెలుపొందిన కౌన్సిలర్లకు విధులు, బాధ్యతల గురించి తెలియాల్సిన అవసరం ఉందని అన్నారు. వార్డులో పార్టీలకతీతంగా అందరికీ పనిచేయాలని కౌన్సిలర్లకు సూచించారు. మా వంతు సహకారం అందిస్తామన్నారు. పట్టణంలో శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మెదక్ 9వ వార్డులో పెంచిన ఇంటి పన్ను తగ్గించాలని కౌన్సిలర్ జుబేర్ అహ్మద్ కోరారు. వార్డులో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ తొడుపునూరి శివరామకృష్ణ మాట్లాడుతూ రైతు బజార్ వద్ద పార్కింగ్ సమస్య ఏర్పడుతున్నందున సమస్య పరిష్కారం కోసం చొరవ చూపాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కౌన్సిలర్ వెంకటరమణ మాట్లాడుతూ కౌన్సిలర్లకు విధుల పట్ల అవగాహనతో పాటు సంబంధిత అధికారులతో పరిచయం ఏర్పాటు చేయాలన్నారు. చైర్ పర్సన్ కాను రాధిక భూపతిరాజ్ మాట్లాడుతూ అందరి సహకారంతో పట్టణ అభివృద్ధి ప్రధాన ధ్యేయంగా పనిచేస్తామన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు పారిశుధ్యం, విద్యార్థులకు అందే సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులకు సూచించారు. సోమవారం ఇస్నాపూర్‌లోని జెడ్పీ హైస్కూల్, డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, పారిశుధ్యం, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు చదువుపై మరింత దృష్టి సారించాలని సూచించారు. ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన షెడ్యూల్ సరిగా అమలు కావడం లేదని గుర్తించిన కలెక్టర్, సంబంధిత సంస్థకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. పాఠశాల హెడ్‌మాస్టర్ అనుమతి లేకుండా గైర్హాజరు కావడంపై ఆగ్రహించిన కలెక్టర్, హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, అదేవిధంగా కొంతమంది ఉపాధ్యాయులు గైర్హాజరు కావడంపై ఎంఈవో వివరణ ఇవ్వాలని, పర్యవేక్షణ లోపించినందుకు ఎంఈవోకు కూడా షోకాజ్ నోటీసు ఇవ్వాలని జిల్లా విద్యాధికారికి సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. శానిటేషన్ గ్రాంట్ కింద ఎంతమందిని ఎంగేజ్ చేసుకుంటున్నారో, వారి పేర్లు, ఎప్పటి వరకు పేమెంట్ చేశారన్న వివరాలను అందించాలని సూచించారు. పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడం, డైనింగ్ హాల్ సరిగా శుభ్రం చేయకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డును పరిశీలించిన కలెక్టర్, అక్కడ మంటలు చెలరేగిన ప్రాంతాన్ని 24 గంటల్లో వాటర్ ట్యాంకర్ల సహాయంతో పూర్తిగా ఆర్పివేయాలని ఆదేశించారు. సెగ్రిగేషన్ ప్రాంతంలో ఉన్న లెగసీ వ్యర్థాలను 48 గంటల్లో పూర్తిగా తరలించి ఆప్రదేశాన్ని శుభ్రం చేయాలని సూచించారు. డంపింగ్ యార్డ్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అక్రమంగా చెత్త వేయకుండా 24 గంటల పర్యవేక్షణ ఉండేలా ఒక కార్మికుడిని నియమించాలని ఆదేశించారు. అలాగే వ్యర్థాలను సేకరించే మున్సిపల్ ఆటోలు, ప్రైవేట్ వాహనాల ద్వారా చెత్తను ఎక్కడ ప్రాసెస్ చేస్తున్నారు, ఎక్కడికి తరలిస్తున్నారు అనే అంశంపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా అంశాలపై వెంటనే చర్యలు తీసుకొని యాక్షన్ టేకన్ రిపోర్ట్ ను సమర్పించాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. ఈ సందర్శనలో కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్ పర్సన్ సుమలత, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ప్రజావాణికి జిల్లా అధికారులు హాజరుకావాలి

- స్థానికసంస్థల అదనపు కలెక్టర్ (ఇన్‌చార్జ్) పాండు

**ముద్ర, సంగారెడ్డి:**



ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు విధిగా హాజరుకావాలని, సమయపాలన పాటించాలని, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ (ఇన్‌చార్జ్) పాండు అన్నారు. జిల్లా అధికారులు హాజరుకాకుండా, వారి సహాయకులు హాజరవుతున్న విషయం గమనించామని, ఇకపై అలాంటి పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేసారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 41 ఫిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి దూర ప్రాంతాల నుంచి ప్రజావాణికి వస్తారని, వారి సమస్యలను అధికారులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడమే కాకుండా, తగిన పరిష్కార మార్గాలను కూడా చూపించాలని సూచించారు. ప్రజా సమస్యల పై ఆయా శాఖల అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) మాధురి, నారాయణ్ ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, జెడ్పీ సీఈవో జానకిరెడ్డి, ఆర్డీఓలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

**ముద్ర, నిజామాబాద్:**



జర్నలిస్టుల చిరకాల కోరిక అయిన ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తాము గుర్తిస్తున్నామని, వారి ఆరోగ్య భద్రత (హెల్త్ కార్డ్స్) విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా మీడియా నిలవాలన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్తా, మీరు ఉమారాణి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్బిన్ హుందాన్, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, ప్రెస్ క్లబ్ కార్యవర్గం, సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
10.03.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**సంజూశాంసన్: అద్భుతమైన కవర్ డ్రైవ్**

కవర్ డ్రైవ్ షాట్ సంజూ ప్రత్యేకత. అతని ఈ షాట్‌ను చూసి చాలా మంది అభిమానులు ఆకర్షితులవుతారు.





# హైదరాబాద్–విశాఖ మధ్య తగ్గనున్న దూరం

- **కొవ్వూరు -జీలుగుమిల్లి మధ్య 368 కోట్లతో కొత్త హైవే..**
- **పోలవరం మీదుగా 2 లేన్లతో అనుమతి**

**ముద్ర డెస్క్ :**

తూర్పు గోదావరి జిల్లాలోని కొవ్వూరు ఏలూరు జిల్లా లోని జీలుగుమిల్లి మధ్య 86.7 కిమీ ల హైవే కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది కేంద్రం. రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు మాజీ కేంద్ర మంత్రి దగ్గుపాటి పురంధ్రీశ్వరి ఈ వివరాలు తెలిపారు. మొత్తం 368కోట్ల రూపాయలతో నిర్మించే ఈ డబుల్ లైన్ హైవే ఏజెన్సీ గ్రామాలకూ, పోలవరం ప్రాజెక్ట్ కూ చాలా రకాలుగా ఉపయోగపడనున్నట్టు ఆమె ప్రకటించారు.
ఇప్పటికే కొవ్వూరు నుండి గోదావరి గట్టు వెంబడి పోలవరం వరకూ ఒకరోడ్డు, పోలవరం నుండి జీలుగుమిల్లి వరకూ మరొక రోడ్డు ఉన్నాయి. అయితే ఇవి సింగిల్ లైన్ రోడ్లు. రవాణా సౌకర్యం కూడా తక్కువే. ఇప్పుడు ఆ రెండు రోడ్లనూ కలుపుతూ ఒకే రోడ్డు క్రింద మార్చబోతున్నారు.మొత్తం 86.7 కిమీ పొడవైన ఈ రోడ్డు కొవ్వూరు లోని గోదావరి మాత విగ్రహం నుండి మొదలై గోదావరి పై నిర్మించిన గామన్ బ్రిడ్జ్ క్రింద నుండి పట్టిసీమ,పోలవరం మీదుగా జీలుగుమిల్లి వరకూ వెళుతుంది. ఈ రూట్ లో 30 మైదాన గ్రామాలు, 100 ఏజెన్సీ గ్రామాలు కవర్ అవుతాయి. ఆయా ప్రాంతాల స్టూడెంట్స్, ఉద్యోగులు, చిన్నకారు వ్యాపారస్తులు, వ్యవసాయ దారులకు ఈరోడ్డు మెరుగైన ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కలిగిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. క్రొత్త గా వచ్చే ఈ హైవే వలన హైదరాబాద్ విశాఖపట్నం మధ్య మరింత దూరం తగ్గనుంది. ఈ హైవే పూర్తి అయితే ఆల్రెడీ నిర్మాణం చివరి దశ లో ఉన్న ఖమ్మం దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే కి మరొక ప్రత్యామ్నాయం వచ్చినట్టే అవుతుంది.

**టూరిస్ట్ ప్లేస్ లు కవర్ అయ్యేలా హైవే నిర్మాణం**

కొవ్వూరు జీలుగుమిల్లి రెండు వరుసలు హైవే చాలా టూరిస్ట్ ప్రాంతాలను కవర్ చేస్తూ వెళుతుంది. వాటిలో 200ల సినిమా షూటింగ్ లు జరుపుకున్న సినిమా చెట్టు ఉండే కుమారదేవం, పట్టిసీమ ప్రాజెక్టు, పట్టిసీమ టెంపుల్, పోలవరం ప్రాజెక్టు లతో పాటు పోలవరం జీలుగుమిల్లి మధ్య ఉన్న ఏజెన్సీ (అటవీ ప్రాంతాలు ) గ్రామాలు ఉన్నాయి. ఈ హైవే వల్ల ట్రాన్స్ పోర్ట్ తో పాటు టూరిజం కూడా డెవలప్ అవుతుంది అని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ హైవే పూర్తి అయితే ఇది పోలవరం ప్రాంతాల అభివృద్ధి కి గేమ్ చేంజర్ అవుతుందని అక్కడి ప్రజలు అంటున్నారు.
ఖమ్మం నుండి దేవరపల్లి మధ్య రెడీ అవుతోన్న గ్రీన్ ఫీల్డ్ హైవే కొవ్వూరు కి 20కిమీ దూరం లోనే ఉండబోతోంది. అడిగాక చెన్నై హౌరా నేషనల్ హైవే కూడా కొవ్వూరు పై నుండే వెళుతోంది. వీటి జతకి క్రొత్తగా కొవ్వూరు జీలుగుమిల్లి హైవే కూడా శాంక్షన్ కావడం తో కొవ్వూరు అభివృద్ధి స్కై రేకెట్ వేగంతో ముందుకి వెళుతుంది అని అక్కడి ప్రజలు అంటున్నారు.

# అప్ గ్రేడ్ చేసుకుంటూ ముందుకు సాగండి

- **పోలిసింగ్ వ్యవస్థ బలోపేతానికి ప్రణాళికలు**
- **మీ పనితీరు ఆధారంగానే పోస్టింగులు**
- **తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

మారుతోన్న సమాజం... దానికి తగ్గట్టు పెరుగుతోన్న నేరాలను ఛేదించేందుకు పోలీసులు ఎప్పటికప్పుడు తమను తాము అప్ గ్రేడ్ చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. సైబర్ నేరాలు పెరిగిపోతున్న ఈ రోజుల్లో పోలిసింగ్ వ్యవస్థనూ అప్ గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. అందుకోసం సాంకేతిక నైపుణ్యం ఉన్న అధికారులను నియమించుకోవాల్సిన అవసరాన్ని సీఎం ప్రస్తావించారు.
పోలీస్ శాఖ బలోపేతానికి అవసరమైన నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉందన్నారు. పనితీరు ఆధారంగానే పోలీసులకు పోస్టింగులు కల్పిస్తామని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్ లోని ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో "తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్ 2026" కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సేవలందించడం ద్వారానే పోలీసుశాఖకు గౌరవం పెరుగుతుందనే విషయాన్ని ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలని సీఎం చెప్పారు. ప్రస్తుతం కొత్త కొత్త మార్గాల్లో నేరాలు జరుగుతున్నాయనీ దీంతో పోలీసులకు సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు. మనకున్న రిసోర్సుల ద్వారా మాత్రమే సాంకేతిక సవాళ్లను అధిగమించగలమని చెప్పారు. లా అండ్ ఆర్డర్‌ను కంట్రోల్ చేసే క్రమంలో పోలీసులు ఎన్నో సవాళ్లను ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. పోలీసులు ముందుగా సమస్యలను అర్థం చేసుకోవాలని సూచించారు. సమస్య అర్థమైతే సగం సమస్యను పరిష్కారం లభించినట్లేనన్నారు. దేశ జనాభాలో 2.5శాతం ఉన్న తెలంగాణ.. దేశ జీడీపీకి 5శాతం వాటాను అందిస్తోందని చెప్పారు. దేశ జీడీపీకి తెలంగాణ వాటా 10శాతానికి చేరాలనేది తమ ఆశయమని చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీ అత్యంత తీవ్రమైన కాలుష్యాన్ని ఎదుర్కొంటోందనీ బెంగళూరును ట్రాఫిక్ సమస్య వేధిస్తోందన్నారు. ముంబయి, చెన్నై నగరాలు వరద సమస్యను ఎదుర్కొంటున్నాయని వివరించారు.

**సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ..**

సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, రిక్రూట్ మెంట్, ఇతర అంశాలకు సంబంధించి వివిధ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారుల నుంచి కొన్ని ప్రతిపాదనలు తనకు అందాయని సీఎం చెప్పారు. ఆయా ప్రతిపాదనలపై విశ్లేషించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందు కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేస్తానని సీఎం ప్రకటించారు. మీరు చేసిన ప్రతిపాదనలపై కమిటీలో చర్చించి.. చట్టం రూపంలో అమలు చేసుకుందామన్నారు. ఇతర శాఖల్లా పోలీస్ శాఖలో ఆటో మోడ్.. ఆటో ప్రమోషన్ ఉండదని స్పష్టం చేశారు. పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు అప్ గ్రేడ్ అవ్వాల్సిందేనని తేల్చి చెప్పారు. ప్రతీ ఏటా డిసెంబరులో రిట్రీట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. బడ్జెట్ ప్రవేశపెట్టకముందే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకుంటే అవసరమైన నిధులను బడ్జెట్ లో కేటాయించుకోవచ్చని సీఎం తెలిపారు.

# ఒలింపిక్స్, కామన్వెల్త్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం

- **ఆ మేరకు క్రీడా పాలసీకి రూపకల్పన**
- **అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా క్రీడా మైదానాలు**
- **క్రీడాకారులకు మెరుగైన శిక్షణ**
- **క్రీడాశాఖపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి**





**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ప్రపంచంలోనే ప్రతిష్టాత్మకమైన ఒలింపిక్స్, కామన్వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇచ్చే స్థాయికి తెలంగాణ ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఆ మేరకు క్రీడా ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తెలంగాణలోని క్రీడాకారులకు ఆయా క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని సూచించారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో క్రీడాశాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ యూనివర్సిటీకి సంబంధించిన నిర్మాణాల డిజైన్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పన.. అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని రకాల క్రీడలకు అనువుగా మైదానాల ఏర్పాటుపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడాకారులను మరింత ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు ప్రతిభ చూపించేలా వారికి సరైన శిక్షణ ఇవ్వాలన్నారు. స్పోర్ట్స్ యూనివర్సిటీ డిజైన్లను పరిశీలించిన ఆయన ఒలింపిక్స్, కామన్వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇచ్చేలా నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటి వరకు ఉన్న మైదానాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటేలా వారిని తీర్చిదిద్దాలన్నారు. భవిష్యత్ అవసరాల కోసం కోట్ల విజయ భాస్కర్ రెడ్డి, ఎల్‌బీ, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలను ఆధునీకరించాలని పేర్కొన్నారు. ఈ సమీక్షలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వెలుగుమట్ల బాధితుల పక్షాన జాగృతి ఆందోళన.. కవిత అరెస్ట్




**ముద్ర, ఖమ్మం:**

వెలుగుమట్లలో బుల్డోజర్లతో ఇళ్లను కూల్చివేసిన ప్రభుత్వానికి బాధిత మహిళల ఉసురు తగులుతుందని జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. సోమవారం ఖమ్మంలోని అంబేద్కర్ భవన్‌లో వెలుగుమట్ల బాధితులను పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. పరీక్షల సమయంలో విద్యార్థుల పుస్తకాలతో సహా రాత్రికి రాత్రే ఇళ్లను నేలమట్టం చేయడం బాధాకరమని అన్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు బాధితుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ, ప్రజా సంఘాలు కూడా బాధితులకు మద్దతుగా ఉన్నాయని తెలిపారు. అంతకుముందు వెలుగుమట్ల బాధితులతో కలిసి కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లిన కవిత జెడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఖమ్మం ఆర్‌డీవో చర్చలు జరిపినప్పటికీ స్పష్టమైన హామీ రాకపోవడంతో నిరసన కొనసాగించారు. ఈ క్రమంలో పోలీసులు జోక్యం చేసుకుని జాగృతి నాయకులు, వెలుగుమట్ల బాధితులను తోసిపుచ్చుతూ బలప్రయోగం చేశారు. కవితతో పాటు ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ మరియు జాగృతి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో పలువురు గాయపడగా, కొందరు సొమ్మసిల్లిపోయారు. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించాలని కవిత డిమాండ్ చేశారు. పోలీసుల తీరుపై జాగృతి నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిబంధనలు ఉల్లంఘించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.




## ప్రజల భాగస్వామ్యం భేష్

- **పెంబి మండల అభివృద్ధిలో అధికారుల కృషి కూడా కీలకం**
- **విశాఖపట్నం వేదికపై కలెక్టర్ అభిలాష అభినవ్**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

నీతి అయోగ్ లో పెంబి మండల అభివృద్ధి ప్రజల భాగస్వామ్యం, అధికారుల కృషితోనే సాధ్యమైందని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. సోమవారం ఆంధ్ర ప్రదేశ్ లోని విశాఖపట్నం లో జరిగిన నీతి అయోగ్ బెస్ట్ ప్రాక్టీసెస్ సెమినార్ లో కలెక్టర్ అభిలాష పాల్గొన్నారు. ఇందులో భాగంగా నీతి అయోగ్ ఆస్పిరేషన్ బ్లాకు కింద పెంబి మండలంలో చేపట్టిన ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి తదితర మౌలిక సదుపాయాల కల్పనలో చేసిన కృషి, తద్వారా సాధించిన ప్రగతి వివరాలు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పెంబి అభివృద్ధిలో ఎదురైన సవాళ్లు, చేపట్టి చర్యలు వెల్లడించారు. ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి, మహిళలు, గర్భిణుల్లో రక్తహీనత, పోషకాహార లోపాల నివారణ, రోగాల నిర్ధారణ, నివారణ, భూసార పరీక్షల నిర్వహణ, అక్షరాస్యత, విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపు, మౌలిక సదుపాయాల మెరుగు తదితర అంశాల్లో అద్భుత ప్రగతి సాధించినట్లు చెప్పారు. స్థానిక ప్రజల భాగస్వామ్యం, అధికారుల సమష్టి కృషివల్ల పెంబి బ్లాకు ఆస్పిరేషన్ నుంచి ఇన్స్పిరేషన్ గా పయనించిందని సంతోషం వ్యక్తం చేశారు. పెంబి బ్లాక్ అభివృద్ధిలో పాలుపంచుకున్న అధికారులకు, ప్రజలకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

# చెంచుల కోసం ప్రత్యేకంగా మోడల్ కాలనీ



**తాండూరు, ముద్ర :**

తాండూర్ నియోజకవర్గ పరిధిలో గల ప్రతి చెంచు కుటుంబానికి అన్ని వసతులతో కూడిన పక్కా ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో పెద్దేముల్ మండలంలోని చైతన్య నగర్‌లో మంజూరైన 163 ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల సమస్యలు, సూచనలు, సలహాలు స్వయంగా తెలుసుకుని, ఇండ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. గ్రామ ప్రజల సమిష్టి అభిప్రాయం మేరకు మెడల్ కాలనీ ఏర్పాటు చేయాలనే అభ్యర్థనపై సానుకూలంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. చైతన్య నగర్‌లోని ప్రతి అర్హత గల ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించేల చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి చెంచు కుటుంబం సురక్షితమైన, సౌకర్యవంతమైన సొంతింటి కల సాకారం అయ్యేట్లు ముఖ్యమంత్రి, ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గౌరమ్మ శ్రీనివాస్, మర్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకలు లొంక నర్సింలు, మైపాల్ రెడ్డి, శోభారాణీ, ఎల్లారెడ్డి పలు గ్రామల సర్పంచ్ లు, నాయకులు ఉన్నారు..

# ఉగాది వేడుకలను విజయవంతం చేయాలి



- **దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఈ నెల 19న రవీంద్రభారతిలో జరిగే రాష్ట్ర ప్రభుత్వ వేడుకలను విజయవంతం చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నాంపల్లి చేనేత భవన్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి ఆమె ఏర్పాట్లను సమీక్షించారు.సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు హాజరుకానున్న నేపథ్యంలో శాఖలవారీగా అప్పగించిన బాధ్యతలను అధికారులు సమర్థంగా నిర్వర్తించాలని ఆమె సూచించారు. రవీంద్రభారతి పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ, భద్రతపై పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వైద్య శాఖ అత్యవసర వైద్య సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిశుభ్రత, ఉద్యానవన శాఖ వేదిక అలంకరణ, విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరా, మెట్రో వాటర్ తాగునీటి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సాయంత్రం కవి సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 12న అన్ని శాఖలతో కలిసి రవీంద్రభారతి వద్ద రిక్కీ నిర్వహించి ఏర్పాట్లను పరిశీలించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి, విద్యుత్, జీహెచ్ఎంసీ, పోలీస్, జీఏడీ, ఉద్యానవన, దేవాదాయ, అగ్నిమాపక సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహిళా కానిస్టేబుళ్లకు ఘనంగా సన్మానం


**ముద్ర కూకట్‌పల్లి :**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుళ్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, విధుల్లో అంకితభావంతో పనిచేస్తున్న మహిళా సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజ రక్షణలో పురుషులతో సమానంగా మహిళా పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో మహిళల భాగస్వామ్యం గర్వకారణమని, వారు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. అనంతరం మహిళా కానిస్టేబుళ్లకు శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేసి వారిని సత్కరించారు



**సంజూశాంసన్ : క్రమశిక్షణ గల ఆటగాడు**

సంజూ చాలా కూల్‌గా ఉండే ఆటగాడు. ఒత్తిడి సమయంలో కూడా శాంతంగా ఆడటం అతని బలం.



## అసలు టార్గెట్ ఇరాన్ కాదు...గల్ఫ్ ఆర్థిక శక్తులా?

**ముద్ర డెస్క్ :**
పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు పైకి చూస్తే ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న ఘర్షణలా కనిపిస్తున్నాయి. అయితే ఈ పరిణామాల వెనుక మరింత పెద్ద వ్యూహం దాగి ఉందనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విదేశాంగ విధానాన్ని దృష్టిలో పెట్టుకుంటే, అసలు లక్ష్యం ఇరాన్ కాకుండా గల్ఫ్ దేశాల ఆర్థిక ఎదుగుదలనే కావచ్చని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకప్పుడు గల్ఫ్ దేశాల ఆర్థిక వ్యవస్థ పూర్తిగా చమురు వనరులపై ఆధారపడి ఉండేది. కానీ ఇటీవల కాలంలో ఆయిల్ ద్వారా వచ్చిన సంపదను పర్యాటకం, అంతర్జాతీయ పెట్టుబడులు, టెక్నాలజీ, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి రంగాల్లో పెట్టి ఈ దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక శక్తులుగా ఎదుగుతున్నాయి. దుబాయ్, అబూదాబి, దోహా వంటి నగరాలు గ్లోబల్ బిజినెస్ కేంద్రాలుగా మారుతున్నాయి. ఈ వేగవంతమైన ఎదుగుదల పాశ్చాత్య దేశాల ఆర్థిక ఆధిపత్యానికి భవిష్యత్తులో సవాలుగా మారవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నేరుగా మిత్రదేశాలైన గల్ఫ్ దేశాలపై ఒత్తిడి తీసుకురావడం సాధ్యం కాకపోవడంతో, ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతల ద్వారా పరోక్షంగా ప్రాంతంలో అస్థిరత సృష్టించే ప్రయత్నం జరుగుతోందని కొందరు భావిస్తున్నారు. ఇరాన్ కీలక స్థావరాలు, చమురు నిల్వలపై దాడులు జరగడం, దానికి ప్రతిగా ఇరాన్ దూకుడుగా స్పందించడం వల్ల మొత్తం గల్ఫ్ ప్రాంతం ఉద్రిక్తతల్లో చిక్కుకుంటోంది. గల్ఫ్ దేశాల చమురు ఉత్పత్తి లేదా మౌలిక సదుపాయాలు దెబ్బతింటే ప్రపంచ మార్కెట్లపై కూడా తీవ్రమైన ప్రభావం పడే అవకాశం ఉంది. అందువల్ల పశ్చిమాసియాలో జరుగుతున్న ఈ పరిణామాలు కేవలం ప్రాంతీయ ఘర్షణగా కాకుండా, ప్రపంచ ఆర్థిక ప్రభావాలు కలిగించే వ్యూహాత్మక పోరాటంగా మారే అవకాశముందని విశ్లేషకులు చెబుతున్నారు.

## పార్టీ కోసం పనిచేసే వారికి సమూచిత స్థానం

**ముద్ర, పెబ్బేరు :**
శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల కమిటీ కార్యక్రమానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, డిసిసి జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్క నాయకుడికి కార్యకర్తకి ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న అందరికీ సంబంధిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం పార్టీ తరఫున నిర్వహిస్తున్న ఈ ఎన్నికలో బూత్ స్థాయి అధ్యక్షులను నియమిస్తున్నామన్నారు. బూతు స్థాయి అధ్యక్షుడికి, గ్రామ అధ్యక్షుడికి పూర్తి స్వేచ్ఛ ఉంటుందని, వారు గ్రామ సర్పంచ్‌తో సమానమన్నారు. ఒక్కొక్క కమిటీలో 21 మంది ఉంటారని ఆ విధంగా కమిటీ ఏర్పాటు ఉంటుందన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మండల కమిటీకి సంబంధించిన ఆశావాహుల పేర్లను వారు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మద్దిలేటి, జిల్లా మాజీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, మండల అధ్యక్షులు రాములు యాదవ్, పీసీసీ జనరల్ సెక్రెటరీ నందిమల్ల యాదయ్య, ఒబీసీ జనరల్ సెక్రెటరీ కోట్ల రవి, వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదుని రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, న్యాయవాది తిరుపతయ్య , మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, నాయకులు శ్రీహరి రాజు, బీరం రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు కార్యకర్తలు యువకులు మహిళలు పాల్గొన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి నివారణకు రూ.55 లక్షలు

- **మున్సిపల్ సమావేశంలో 13 అంశాలకు ఏకగ్రీవ తీర్మానం**

**ముద్ర, తాండూరు :**
తాండూరు మున్సిపల్ తొలి సమావేశంలో 13 అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. తాండూరు పట్టణ సుందరీకరణ కోసం స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2.0 కింద వాల్ పెయింటింగ్, అవేర్‌నెస్ ప్రోగ్రామ్ వంటి పనులు చేపట్టడానికి రూ. 8లక్షల 70వేల 585 కేటాయించారు. రాబోయే వేసవి కాలంలో నీటి ఎద్దడి నివారించేందుకు 11 పనుల కింద రూ. 55 లక్షలను కేటాయించారు. జేసీబీ మరమ్మత్తులు, విడిభాగాల సేకరణ కోసం రూ. 4 లక్షల 86 వేలు కేటాయించారు. అలాగే వీధి దీపాల మరమ్మత్తుల కోసం హైడ్రాలిక్ క్రేన్ సాయంతో ఇతర పనుల చెల్లింపులకు రూ.3 లక్షలు ఖర్చు చేయాలని కౌన్సిల్ తీర్మానించింది. పారిశుధ్య నిర్వహణకు సంబంధించిన వాహనాలు, ఇతర సామాగ్రిని బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. టెండర్ ప్రక్రియ ద్వారా వెహికల్ మౌంటెడ్ హైడ్రాలిక్ క్రేన్ కొనుగోలు కోసం అంచనా రూ.55 లక్షలను సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయడానికి కూడా కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

**ఆదర్శ పట్టణంగా మార్చుదాం : ఎమ్మెల్యే**
తాండూరు పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. కౌన్సిల్ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. పట్టణాన్ని పార్టీలకు అతీతంగా అభివృద్ధి పరుస్తామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులు కేటాయిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, కమిషనర్ మధుసూదన్ రెడ్డి, మేనేజర్ నరేందర్ రెడ్డి, డీఈఈఎస్ మణిపాల్, ఏఈలు కాజా హుస్సేన్, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఓఆర్ఎస్ ప్యాకెట్ల నాణ్యత పరిశీలించాలి


- **మహిళా సాధికారత కార్యక్రమంలో డాక్టర్ల సూచన**

**ముద్ర, శేరిలింగంపల్లి :**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సి.ఆర్ ఫౌండేషన్ మహిళా సంక్షేమ కేంద్రం ఆధ్వర్యంలో హైదరాబాద్ కొండాపూర్‌లోని సి.ఆర్ ఫౌండేషన్ ఇంద్రజిత్ గుప్తా హాల్‌లో మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జ్యోస్యబట్ల కల్పన అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథిగా పిల్లల వైద్య నిపుణురాలు, మాగ్నా సెంటర్ ఫర్ ఒబేసిటీ, డయాబెటిక్ మరియు ఎండోక్రైనాలజీకి చెందిన డాక్టర్ శివరంజని సంతోష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓఆర్ఎస్ ప్రాముఖ్యతను వివరించి, మార్కెట్‌లో జరుగుతున్న మోసాలపై అప్రమత్తంగా ఉండాలని తల్లిదండ్రులను సూచించారు. ప్రస్తుతం కొనుగోలు చేసే ఓఆర్ఎస్ డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాలకు అనుగుణంగా ఉందా లేదా అని పరిశీలించుకోవాలని తెలిపారుఉస్మానియా మెటర్నిటీ ఆసుపత్రి విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ డి. ప్రతిభ గౌరవ అతిథిగా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారనే విషయం మరవకూడదని పేర్కొన్నారు. కుటుంబం ఆరోగ్యంగా కొనసాగాలంటే మహిళ పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. కార్యక్రమం ప్రారంభంలో సి.ఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ కె. నారాయణ మాట్లాడుతూ ఫౌండేషన్ కార్యకలాపాలను వివరించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలను సత్కరించారు. డాక్టర్ శివరంజని, డాక్టర్ ప్రతిభ, డాక్టర్ అరుణ, డాక్టర్ కె. రజని, జ్యోస్యబట్ల కల్పన, టి.ఎం ఉషారాణి, నలిని, వి. లలిత, వి. లక్ష్మి, మమత, అరుణకుమారి, జ్యోత్స్న, విజయలక్ష్మి, పల్లా విజయ తదితరులతో పాటు టీచర్స్, వర్కర్స్, కమిటీ మెంబర్స్‌ను సన్మానించారు. ఇటీవల పలు కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. మహిళా సంక్షేమ కేంద్రం విద్యార్థులు పాటలతో కార్యక్రమాన్ని అలరించారు. తొలుత వంకా లక్ష్మి వేదికపైకి అతిథులను ఆహ్వానించగా, మహిళా సంక్షేమ కేంద్రం కమిటీ సభ్యురాలు వి. లలిత వందన సమర్పణ చేశారు.

# తెలంగాణలో 50 లక్షల ఓట్లు తొలగింపు..!

- **ప్రత్యేక సాఫ్ట్ వేర్ ఏప్రిల్‌లో ఈసీ SIR !**
- **వారి ఓట్లు గల్లంతే**

**ముద్ర డెస్క్ :**
దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ తెలంగాణలో ఏప్రిల్, మే నెలల్లో జరగనుంది. ఈ ప్రక్రియ ద్వారా సుమారు 50 లక్షల ఓట్లదాకా బారీగా తొలగింపు జరగొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. గడిచిన పదిహేనేళ్లలో రెండు మూడు చోట్ల ఓట్లు నమోదు చేసుకుని అన్నిచోట్లా కొనసాగుతున్న వారి డూప్లికేట్ ఓట్లు ఇకపై కొనసాగవని ఈసీ అధికారులు చెప్తున్నారు. తెలంగాణా వ్యాప్తంగా వున్న 3.35 కోట్ల ఓట్లు ఈ సవరణ తర్వాత 2.75 లేదా 2.80 కోట్లకు తగ్గిపోయే అవకాశముంది.




**హైదరాబాద్ లోనే అత్యధిక ఓట్ల తొలగింపు..**
పట్టణీకరణ, ఉపాధి అవకాశాల వల్ల ఇటీవల చాలామంది హైదరాబాద్ కు వలస వచ్చి స్థిరపడుతున్నారు. ఐనప్పటికీ వారి స్వంత గ్రామాల్లో కూడా ఓట్లు కొనసాగిస్తూ సందర్భాన్నిబట్టి రెండు చోట్లా ఓటు వినియోగించుకుంటున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ వచ్చిన వారు ఇక్కడ ఓటు నమోదు చేసుకున్నారు. రెండు రాష్ట్రాల్లోనూ అసెంబ్లీ ఎన్నికలు వేర్వేరుగా జరుగుతుండటం వల్ల రెండు చోట్లా ఓటు వినియోగించుకుంటున్నారు. తాజా సవరణ జరిగితే ఆ డూప్లికేషన్కి అవకాశం ఉండదు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో కలిపి మొత్తంగా 87 లక్షల ఓట్లు ఉన్నాయి. అందులో ఈ రకమైన డూప్లికేట్ ఓట్లు సుమారు 20 లక్షలదాకా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ జిల్లాలనుంచి వచ్చినవారితోపాటు తెలంగాణ గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చి రాజధాని నగరంలో స్థిరపడి ఓటు నమోదుచేసుకున్నవారూ ఉన్నారు.

**గ్రామీణ తెలంగాణలో సుమారు 30 లక్షల ఓట్లు తొలగింపునకు అవకాశం.**
తెలంగాణలో పట్టనీకరణ వేగంగా జరుగుతోంది. హైదరాబాద్ తోపాటు జిల్లాల్లోని వివిధ ప్రధాన పట్టనాలకు వలసలు పెరిగాయి. పెద్ద పట్టనాలైన వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్ లాంటి పట్టనాల్లో ఓటర్లు భారీగా పెరిగారు. ఆమేరకు ఆయా పట్టణ పరిసల గ్రామాల్లో ఓటర్ల సంఖ్య తగ్గాలి కానీ వారు ఓటు మాత్రం రెండు చోట్లా కొనసాగిస్తున్నారు. ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ద్వారా గ్రామీణ తెలంగాణలో కూడా సుమారు మరో 30 లక్షల ఓట్లదాకా తగ్గొచ్చని అంచనా. కొన్ని చోట్ల గ్రామాల్లో ఓటు కొనసాగించేందుకు ప్రాధాన్యత ఇవ్వగా కొందరు స్వగ్రామాల్లోనే ఓటు కొనసాగింపునకు సుముఖంగా వున్నారు. ఏది ఏమైనా రెండు చోట్ల మాత్రం ఓటు ఉండకుండా వుండేందుకు ఈసీ అన్ని జాగ్రత్త చర్యలూ తీసుకుంటోంది.

**ప్రత్యేక సాఫ్ట్ వేర్ ద్వారా డూప్లికేట్ ఓట్ల గుర్తింపు..**
బూత్ లెవల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఎన్యూమరేటర్ల ద్వారా మొదట ప్రతీ ఇల్లూ సర్వేచేసి ప్రాధమిక జాబితారూపొందిస్తారు. ఆ సమయంలో ఓటరు స్వయంగా అందుబాటులో ఉండి అక్కడే తన ఓటు కొనసాగించాల్సిందగా చెప్పవచ్చు. లేదా మీ తరపున ఆ ఇంటి యజమాని తగిన డాక్యుమెంటు ఆధారాలిచ్చి ఫారంలో సంతకం చేసినా సరిపోతుంది. ఒకే వ్యక్తికి రెండు లేదా అంతకంటే ఎక్కువ ఓట్లున్నట్టు గుర్తించేందుకు ఈసీ ఓ ప్రత్యేక సాఫ్ట్ వేర్ వినియోగించబోతోంది. డెమోగ్రఫీ సిమిలర్ ఎంట్రీస్ ను పరిశీలిస్తారు. పేరు, తండ్రిపేరు, వయసు, చిరునామా ల్లో సిమిలారిటీ వుంటే వాటిని గుర్తించి నోటీసులు ఇస్తారు. ఎవరైతే ఈ రకమైన ఆధారాలు ఇవ్వరో ఆ ఓటు తొలగిస్తారు.

**మొత్తం నాలుగు దశల్లో ప్రక్రియ ..**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) మొత్తం 4 దశల్లో జరుగుతుంది. మొదటిది డోర్ టు డోర్ సర్వే మీ బూత్ లెవల్ ఆఫీసర్లు ప్రతీ ఇంటికీ వెళ్లి సర్వేచేస్తారు. రెండవది ఆ సర్వే ఆధారంగా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల రూపొందిస్తారు. వాటి ముసాయిదా జాబితా విడుదలచేస్తారు. మూడవ దశ జాబితాలో ఏవైనా తప్పులున్నా, ఓటు నమోదు కాకున్నా అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరించి సవరిస్తారు. నాలుగవది ఫైనల్ ఓటర్ల జాబితా.

**రాజకీయ విమర్శలకి అవకాశం..!!**
ఇప్పటికే ఎన్నికలు జరిగిన బీహార్, త్వరలో ఎన్నికలు జరగబోతోన్న బెంగాల్ , తమిళనాడు తదితర రాష్ట్రాలో ఈ ఎస్ ఐ ఆర్ పై పలు ఆరోపణలు వస్తున్నాయి. అధికార పార్టీ, లేదా యంత్రాంగం ఉద్దేశపూర్వకంగా ఓ వర్గానికి లేదా రాజకీయంగా తమకు వ్యతిరేకుల ఓట్లను వలసుల పేరిట తొలగిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మరి తెలంగాణలో ఎలా నిర్వహిస్తారో ప్రక్రియ ప్రారంభమైతే గానీ తెలియదు.

# రాజ్యసభ ఏకగ్రీవం



- **తెలంగాణ నుంచి సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి**
- **ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన కమిషనర్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
ఊహించినట్టే జరిగింది. తెలంగాణలో రాజ్యసభ ఎన్నిక ఏకగ్రీవమైంది. రాష్ట్రం నుంచి కాంగ్రెస్ అభ్యర్థులు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక దాదాపు ఖరారైంది. వీరితోపాటు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసిన ఇండిపెండెంట్ అభ్యర్థి సాయి.. నిబంధనల ప్రకారం ఎమ్మెల్యేల మద్దతు లేకుండా నామినేషన్ వేశారు. దీంతో అతని నామినేషన్ స్క్రూటినీ దశలోనే తిరస్కరణకు గురైంది. దీంతో కాంగ్రెస్ అభ్యర్థులు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నికకు మార్గం సుగమమైంది. మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల విత్ డ్రా ముగియగా, సాయంత్రం 4 గంటలకు అసెంబ్లీలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ ఎన్నికపై అధికారిక ప్రకటన చేశారు. ప్రస్తుతం బిఆర్ఎస్ పోటీలో లేకపోవటం, అసెంబ్లీలో ఉన్న బలాబలాల దృష్ట్యా సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి సునాయాసంగా ఎన్నికయ్యారు. కాగా రాజస్థాన్ కు చెందిన సింఘ్వీ తెలంగాణ నుంచి సిట్టింగ్ మెంబర్ గా కొనసాగుతున్నారు.

**అత్యంత ధనికుడు సింఘ్వీ..**
సింఘ్వీ తన కుటుంబ ఆస్తుల విలువ రూ. 2,558 కోట్లుగా వెల్లడించారు. వ్యక్తిగతంగా తనకు ఒక్క రూపాయి కూడా అప్పులేదని ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వ్యక్తిగత చరాస్తుల విలువ రూ.1,536 కోట్లుగా వెల్లడించారు. తన భార్య అనిత పేరిట ఉన్న చరాస్తుల విలువ రూ.568 కోట్లు, హెచ్‌యూఎఫ్ పేరిట ఉన్న ఆస్తుల విలువ రూ. 51 లక్షలుగా చూపించారు. అభిషేక్ తన చేతిలో రూ.69.99 లక్షలు నగదు ఉందని చెప్పారు. ఇక ఢిల్లీలో రెండు గృహాలు, మహారాష్ట్ర అలీబాగ్ నగావ్‌బీచ్‌లో ఎకరా స్థలం విలువ కలిపి మొత్తం రూ. 60 కోట్లు అని పేర్కొన్నారు. భార్య పేరిట స్థిరాస్తుల విలువ రూ. 333.50 కోట్లుగా ఉందని వెల్లడించారు. హెచ్‌యూఎఫ్ పేరిట ఢిల్లీలో రూ. 60 కోట్ల విలువైన 2.5 ఎకరాల స్థలం ఉన్నట్లు తెలిపారు. 202425 ఏడాదికి ఆదాయపన్ను శాఖకు సమర్పించిన ఐటీ రిటర్నులో వ్యక్తిగత ఆదాయం రూ. 374.05 కోట్లు అని అఫిడవిట్‌లో చూపించారు.

**వేం నరేందర్‌రెడ్డి ఆస్తి రూ. 41.5 కోట్లే..**
వేం నరేందర్‌రెడ్డి తన కుటుంబ ఆస్తుల మొత్తం విలువ రూ. 41.5 కోట్లుగా పేర్కొన్నారు. మొత్తం అప్పులు రూ.1.62 కోట్లు ఉన్నాయని తెలిపారు. తన భార్య పేరుతో కేసముద్రంలో 7.33ఎకరాలు, కుటుంబ ఆస్తి కింద అర్వణపల్లిలో మరో 15.17 ఎకరాల భూమి, తన పేరిట కేసముద్రంలో 1,050 గజాల వ్యవసాయేతర స్థలం ఉందన్నారు. దీంతో పాటు హైదరాబాద్, వరంగల్, కేసముద్రంలో మూడు కమర్షియల్ బిల్డింగ్‌లు ఉన్నట్లు పేర్కొన్నారు.. 202425లో తన సంపాదన రూ. 22.02 లక్షలుగా.. భార్య సంపాదన రూ.12.79 లక్షలుగా వెల్లడించారు. తన చేతిలో నగదు రూ.4.99 లక్షలు మాత్రమే ఉందన్నారు. తెలంగాణ నుంచి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన కాంగ్రెస్ అభ్యర్థులు వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీ ఎన్నికకు సంబంధించిన అధికారిక ధృవీకరణ పత్రాలు అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ప్రాంగణంలో రిటర్నింగ్ అధికారి చేతుల మీదుగా వారు ఈ సర్టిఫికేట్లను స్వీకరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులకు కాంగ్రెస్ నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

## రోడ్డు ప్రమాద ఘటనపై బాధితులకు సత్వర న్యాయం

**బాధితుల వద్దకే వెళ్లి కేసు నమోదు చేసిన పోలీసులు**

**ముద్ర, నారాయణపేట :**
రోడ్డు ప్రమాద ఘటనపై గంటల వ్యవధిలోనే బాధితుల వద్దకే వెళ్లి నారాయణపేట మండల పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నారాయణపేట మండలంలోని షేర్నపల్లి గ్రామానికి చెందిన గోవిందోళ్ల నర్సింగప్ప (47) రోజువారీ కూలి పనుల కోసం కొల్లంపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి నడుచుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో కొల్లంపల్లి స్టేజి సమీపంలోని అన్నపూర్ణ రైస్ మిల్ వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్‌కు తరలించగా సోమవారం మృతి చెందినట్లు ఎస్సై రాముడు తెలిపారు. ఈ ప్రమాద ఘటనకు కారణమైన నారాయణపేట పట్టణానికి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై నారాయణపేట సీఐ శివశంకర్, రూరల్ ఎస్సై రాముడు సంఘటన స్థలానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. అనంతరం అక్కడికక్కడే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును బిఎన్ఎస్ చట్టం కింద నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు రాలేని పరిస్థితిలో ఉన్న బాధితుల వద్దకే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ద్వారా న్యాయం ఆలస్యం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# ఎన్టీపీసీతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకోండి

- **సీఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
రామగుండం ఎన్టీపీసీ నిర్మిస్తున్న రెండో దశ థర్మల్ పవర్ ప్రాజెక్టుతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకోవాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ విషయంపై ఆలోచన చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి ఆయన సోమవారం ఒక లేఖ రాశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోందని ఆయన లేఖలో పేర్కొన్నారు. మార్చి 3, 2026న రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 18,139 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదైందని గుర్తు చేశారు. భవిష్యత్తులో గ్రిడ్ స్థిరత్వం కోసం అదనంగా 5వేల నుంచి 6వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్ అవసరమని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో, ఎన్టీపీసీ ప్రాజెక్టు అత్యంత కీలకంగా మారుతుందని ఆయన తెలిపారు. రామగుండంలో ఎన్టీపీసీ ఏర్పాటు చేయాల్సిన 4వేల మెగావాట్ల ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే మొదటి దశ (2×800 మెగావాట్లు) పూర్తయిందన్నారు. 2023లోనే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దీనిని జాతికి అంకితం చేశారని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. ఇప్పుడు రెండో దశలో భాగంగా 3×800 (2,400) మెగావాట్ల సామర్థ్యం గల మూడు యూనిట్లను ఎన్టీపీసీ చేపట్టనుందన్నారు. ఇందులో ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో 85 శాతాన్ని కేవలం తెలంగాణకే సరఫరా చేయనున్నట్లు ఆయన వివరించారు.

**తక్కువ ధరకే నాణ్యమైన విద్యుత్..**
అత్యాధునిక 'అల్ట్రా సూపర్ క్రిటికల్' సాంకేతికతతో ఎన్టీపీసీ తక్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి చేస్తుందని కిషన్ రెడ్డి వివరించారు. గతంలో స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ ప్రాజెక్టు పనితీరును ప్రశంసించారని ఆయన గుర్తు చేశారు. బొగ్గు సమీకరణలో ఎన్టీపీసీకి తగిన స్వేచ్ఛనిస్తే మరింత తక్కువ ధరకు నాణ్యమైన విద్యుత్తును అందించడం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. దీంతో ప్రభుత్వానికి, ప్రజలకు ఇద్దరికీ ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందన్నారు. ఇప్పటికే ఇతర దక్షిణాది రాష్ట్రాలు ఎన్టీపీసీతో ఒప్పందాలు



చేసుకుంటున్నాయని తెలిపారు. తెలంగాణ కూడా వేగంగా స్పందించి విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకోవాలని సూచించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి వ్యక్తిగత చొరవ తీసుకోవాలని కిషన్ రెడ్డి తన లేఖలో పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
10.03.2026 మంగళవారం, హైదరాబాద్



## సంజూశాంసన్ : ఫుట్‌బాల్ ప్రేమికుడు

క్రికెట్‌తో పాటు సంజూకు ఫుట్‌బాల్ కూడా చాలా ఇష్టం. ఖాళీ సమయాల్లో ఫుట్‌బాల్ ఆడటం అతని హాబీ.






# టీ20 ప్రపంచకప్‌లో భారత ఆటగాళ్ల ఘనత...

## రెండుసార్లు టైటిల్ గెలిచిన స్టార్‌లు వీరే

టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను కైవసం చేసుకుని టీమిండియా మరోసారి చరిత్ర సృష్టించింది. ఈ విజయానికి జట్టులోని మొత్తం 15 మంది ఆటగాళ్లు కీలక పాత్ర పోషించారు. వీరిలో కొంతమంది ఆటగాళ్లు తొలిసారిగా టీ20 ప్రపంచకప్‌లో ఆడగా, మరికొందరు ఇప్పటికే అనుభవం ఉన్నవారుగా జట్టుకు బలంగా నిలిచారు. భారత్ తరఫున టీ20 ప్రపంచకప్‌ను రెండుసార్లు గెలిచిన ఆటగాళ్ల జాబితాలో పలువురు ప్రముఖులు ఉన్నారు. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా, సంజూ శాంసన్, కుల్దీప్ యాదవ్, శివమ్ దూబే, మహ్మద్ సిరాజ్, అక్షర్ పటేల్, అర్ష్దీప్ సింగ్ వంటి ఆటగాళ్లు ఈ ఘనత సాధించారు. 2007లో జరిగిన తొలి టీ20 ప్రపంచకప్‌ను భారత్ గెలుచుకున్న జట్టులో రోహిత్ శర్మ కూడా భాగమయ్యాడు. తర్వాత 2024లో కూడా భారత్ టైటిల్ గెలవడంతో ఆయన రెండుసార్లు విజేతగా నిలిచాడు. ఇక 2024, 2026లో జరిగిన టీ20 ప్రపంచకప్ టోర్నీల్లో సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా, సంజూ శాంసన్, కుల్దీప్ యాదవ్, శివమ్ దూబే, మహ్మద్ సిరాజ్, అక్షర్ పటేల్, అర్ష్దీప్ సింగ్ జట్టులో భాగమయ్యారు. అయితే 2024 టోర్నీలో సంజూ శాంసన్‌కు ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. ప్రపంచ క్రికెట్‌లో మొత్తం 18 మంది ఆటగాళ్లు టీ20 ప్రపంచకప్‌ను రెండుసార్లు గెలిచారు. వీరిలో వెస్టిండీస్‌కు చెందిన డారెన్ సామీ, మార్లన్ శామ్యూల్స్, క్రిస్ గేల్, జాన్సన్ చార్లెస్, డ్వేన్ బ్రావో, శామ్యూల్ బద్రీ, ఆండ్రీ రస్సెల్, దినేష్ రామ్దిన్ వంటి ఆటగాళ్లు కూడా ఉన్నారు. వీరు 2012, 2016లో వెస్టిండీస్ జట్టు టైటిల్ గెలిచినప్పుడు కీలక పాత్ర పోషించారు. ఇలా భారత్, వెస్టిండీస్ ఆటగాళ్లు కలిసి టీ20 ప్రపంచకప్ చరిత్రలో రెండుసార్లు టైటిల్ గెలిచిన ప్రత్యేక ఘనతను నమోదు చేసుకున్నారు.



## టీ20 ప్రపంచకప్‌లో సూర్య రికార్డు

**జట్టులో పెద్దవాడు కూడా ఆయనే**

సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలో టీమిండియా మరో టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో ప్రత్యేకత ఏమిటంటే బీసీసీఐ ఎంపిక చేసిన జట్టులోని ప్రతి ఆటగాడికి కనీసం ఒక మ్యాచ్ ఆడే అవకాశం లభించింది. అంతేకాదు ప్రతి ఆటగాడు ఏదో ఒక విధంగా జట్టు విజయానికి తన వంతు సహకారం అందించాడు. ఈ జట్టులో అత్యంత వయసు కలిగిన ఆటగాడిగా కూడా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నిలిచాడు. ప్రస్తుతం ఆయన వయసు 35 సంవత్సరాలు. కెప్టెన్‌గా జట్టును విజయ పథంలో నడిపించినప్పటికీ ఈ టోర్నీలో కొన్ని మ్యాచ్‌లు మినహా సూర్య బ్యాట్ పెద్దగా రాణించలేదు. ఫైనల్ మ్యాచ్‌లో కూడా సూర్య ఖాతా తెరవకుండానే సున్నా పరుగులకే ఔటయ్యాడు. ఇక సూర్యకుమార్ యాదవ్ ఇంకా ఎంతకాలం టీ20ల్లో కొనసాగుతాడు అన్నది ఆయన ఫామ్‌పైనే ఆధారపడి ఉంటుంది. బ్యాట్ మళ్లీ రాణిస్తే వచ్చే ప్రపంచకప్ వరకూ కొనసాగొచ్చు. లేదంటే త్వరలోనే రిటైర్మెంట్‌పై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## టీమిండియా మళ్లీ మైదానంలోకి దిగేదెప్పుడు?

టీ20 వరల్డ్ కప్ 2026 టైటిల్‌ను కైవసం చేసుకుని టీమిండియా సరికొత్త చరిత్ర సృష్టించింది. టోర్నీ అంతటా అద్భుత ప్రదర్శన చేసిన భారత జట్టు సూపర్ 8లో ఒక్క మ్యాచ్ మాత్రమే ఓడింది. మిగతా అన్ని మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. ఫైనల్లో న్యూజిలాండ్‌ను 96 పరుగుల తేడాతో ఓడించిన టీమిండియా మూడోసారి టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకుని ఈ ఘనత సాధించిన తొలి జట్టుగా నిలిచింది. నెల రోజుల పాటు కొనసాగిన ఈ టోర్నీలో భారత ఆటగాళ్లు అద్భుత ఆటతీరు ప్రదర్శించారు. ఫైనల్లో బలమైన న్యూజిలాండ్ జట్టును భారీ తేడాతో ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. టోర్నీ ముగిసిన తర్వాత ఇప్పుడు ఆటగాళ్లు కొంతకాలం విశ్రాంతి తీసుకోనున్నారు. దీంతో టీమిండియా మళ్లీ ఎప్పుడు మైదానంలోకి దిగుతుంది అనే ప్రశ్న అభిమానుల్లో తలెత్తుతోంది. వాస్తవానికి టీమిండియా వెంటనే మ్యాచ్‌లు ఆడదు. మార్చి 28 నుంచి ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభం కానుంది. ఈ టోర్నీ దాదాపు రెండు నెలల పాటు కొనసాగుతుంది. ఐపీఎల్ ముగిసిన తర్వాత భారత జట్టు అఫ్గానిస్థాన్‌తో తలపడనుంది. జూన్ 6 నుంచి భారత్, అఫ్గానిస్థాన్ జట్ల మధ్య భారత గడ్డపై ఏకైక టెస్టు మ్యాచ్ జరగనుంది. అంటే దాదాపు మూడు నెలల తర్వాత టీమిండియా మళ్లీ అంతర్జాతీయ మ్యాచ్ ఆడనుంది.






## అదీ టీమిండియా హుందాతనం

**ఆస్ట్రేలియా క్రికెటర్లు సిగ్గుతో తలదించుకునేలా చేసిన సూర్య**

క్రికెట్‌లో విజయాన్ని ఎలా జరుపుకోవాలి అన్న విషయంలో టీమిండియా మరోసారి హుందాతనం చూపించింది. గతంలో 2023 వన్డే వరల్డ్ కప్ గెలిచిన తర్వాత ఆస్ట్రేలియా ఆటగాళ్లు ట్రోఫీపై కాళ్లు పెట్టి ఫొటోలు దిగడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఇక టీమిండియా మాత్రం ఐసీసీ టోర్నీల విజయాల తర్వాత భిన్నంగా స్పందించింది. 2026 టీ20 వరల్డ్ కప్ గెలిచిన అనంతరం భారత ఆటగాళ్లు అహ్మదాబాద్‌లోని ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి ట్రోఫీని స్వామివారి సన్నిధిలో ఉంచి ప్రార్థనలు చేశారు. ఆటగాళ్లు, కోచ్‌లు కలిసి ఆలయంలో ప్రార్థనలు చేసిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. టీమిండియా చూపించిన ఈ హుందాతనాన్ని అభిమానులు ప్రశంసిస్తున్నారు.




## ఐపీఎల్‌కు ముందే చెన్నై సూపర్ కింగ్స్ కసరత్తు

ఐపీఎల్ ప్రారంభానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ముందుగానే సిద్ధమవుతోంది. ఈసారి జట్టును ఎవరు నడిపిస్తారు? ధోని పాత్ర ఏమిటి? అన్న అంశాలపై స్పష్టత రాకపోయినా, మేనేజ్‌మెంట్ మాత్రం జట్టును బలోపేతం చేసే పనిలో ఉంది. ఫీల్డింగ్ విభాగాన్ని బలోపేతం చేయడానికి ఇంగ్లాండ్ మాజీ వికెట్‌కీపర్, బ్యాటర్ జేమ్స్ ఫోస్టర్‌ను ఫీల్డింగ్ కోచ్‌గా నియమించినట్టు సమాచారం. 2001 నుంచి 2009 మధ్య ఇంగ్లాండ్ తరఫున ఏడు టెస్టులు, 11 వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు ఆడిన ఫోస్టర్ త్వరలో జట్టుతో చేరనున్నట్టు చెన్నై సీఈవో కాశీ విశ్వనాథన్ తెలిపారు. ఇప్పటికే చెన్నై జట్టు ఆటగాళ్ల కోసం ప్రీ సీజన్ శిక్షణ శిబిరం కూడా ప్రారంభమైంది. ధోని సహా పలువురు ఆటగాళ్లు ఇందులో పాల్గొంటున్నారు. గత సీజన్‌లో నిరాశజనక ప్రదర్శన చేసిన జట్టు ఈసారి మెరుగైన ఫలితాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.




## యుద్ధం ఎఫెక్ట్... ఐసీసీ సమావేశం వాయిదా

మిడిల్ ఈస్ట్‌లో కొనసాగుతున్న యుద్ధం ప్రభావం క్రీడలపై కూడా పడింది. ఖతార్‌లోని దోహాలో మార్చి 25 నుంచి 27 వరకు నిర్వహించాల్సిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేశారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఈ సమావేశంలో ఐసీసీ బోర్డు డైరెక్టర్లు, చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొని క్రికెట్ అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన అంశాలపై చర్చించాల్సి ఉంది. యుద్ధ పరిస్థితులు కొనసాగుతుండటంతో సమావేశాన్ని మరో ప్రాంతంలో నిర్వహించే అవకాశముందని తెలుస్తోంది. కొత్త తేదీలను త్వరలో ప్రకటించే అవకాశం ఉంది.



## టీమిండియా విజయం... ప్లేట్ ఫిరాయించిన పాక్ క్రికెటర్లు

టీమిండియా విజయంపై పాకిస్తాన్ మాజీ క్రికెటర్ల వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. సూపర్ 8 దశలో భారత్ ఓడినప్పుడు టీమిండియా సెమీఫైనల్, ఫైనల్‌కు చేరదని కొందరు పాక్ మాజీ ఆటగాళ్లు విమర్శలు చేశారు. అయితే టీమిండియా ఫైనల్‌కు చేరుకుని విజయం సాధించిన తర్వాత కూడా విమర్శలు ఆగలేదు. పాక్ మాజీ క్రికెటర్ మహమ్మద్ అమీర్ ఫైనల్‌లో న్యూజిలాండ్ బౌలర్లు సరిగా బౌలింగ్ చేయకపోవడం వల్లే భారత్ గెలిచిందని వ్యాఖ్యానించాడు. ఈ వ్యాఖ్యలపై భారత అభిమానులు సోషల్ మీడియాలో స్పందిస్తున్నారు. ఇతర జట్ల విజయాలను అంగీకరించకుండా విమర్శలు చేయడం సరైంది కాదని కామెంట్లు చేస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
10.03.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



# బాక్సింగ్ రింగ్‌లో అందాల భామ

మహిళా దినోత్సవం సందర్భంగా నటి నభా నటేష్ ప్రత్యేక ఫొటోషూట్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు. షీ ఇండియా మ్యాగజైన్ కవర్ పేజీపై బాక్సింగ్ థీమ్‌లో బోల్డ్ లుక్‌లో మెరిశారు. మహిళల ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించేలా ఈ ఫొటోషూట్ రూపొందింది. కవర్ పేజీలో నభా నటేష్ బ్లాక్ స్పోర్ట్స్ బ్రా, ట్రైనింగ్ షార్ట్స్, బాక్సింగ్ గ్లౌజ్‌లతో అథ్లెట్ స్టైల్‌లో కనిపించారు. ధైర్యంగా నిలిచిన ఆమె పోజ్ మహిళల శక్తి, పోరాటస్ఫూర్తిని సూచిస్తోంది. డ్రమాటిక్ లైటింగ్, పొగమంచు బ్యాక్‌డ్రాప్ ఫొటోషూట్‌కు ప్రత్యేకమైన సినీమాటిక్ లుక్ తీసుకొచ్చాయి. బాక్సింగ్ గ్లౌజ్‌లతో కనిపించిన ఈ ఫొటోషూట్ మహిళలు ధైర్యవంతులు, సవాళ్లను ఎదుర్కొనే శక్తి కలిగినవారనే సందేశాన్ని తెలియజేస్తోంది. నభా నటేష్ స్టైలిష్ లుక్ సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటోంది.



# నటుడిగా గౌతమ్ ఎంట్రీ..

## తొలి అడుగులోనే అదరగొట్టిన సూపర్ స్టార్ తనయుడు

సూపర్ స్టార్ మహేష్ బాబు తనయుడు గౌతమ్ నటుడిగా తొలి అడుగు వేశారు. '14 డేస్' పేరుతో రూపొందించిన మూడు నిమిషాల 20 సెకన్ల షార్ట్ ఫిల్మ్ యూట్యూబ్‌లో విడుదలై మంచి స్పందన పొందుతోంది. ఈ షార్ట్ ఫిల్మ్‌కు గౌతమ్ స్నేహితుడు అలెక్స్ లక్ష్మి దర్శకత్వం వహించగా, అనూషే ధనేని హీరోయిన్‌గా నటించింది. కిడ్నాప్‌కు గురైన ప్రేయసిని వెతుక్కుంటూ హీరో పడే ఆవేదన నేపథ్యంలో కథ సాగుతుంది. చిన్న నిడివి ఉన్నప్పటికీ గౌతమ్ నటన ఆకట్టుకుందని సోషల్ మీడియాలో కామెంట్లు వస్తున్నాయి. ప్రస్తుతం గౌతమ్ న్యూయార్క్ యూనివర్సిటీలో యాక్టింగ్ కోర్స్ చేస్తున్నారు. భవిష్యత్తులో హీరోగా ఎంట్రీ ఇవ్వనున్నట్టు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇక మహేష్ బాబు రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వారణాసి' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఇటీవల జార్జియాలో షెడ్యూల్ పూర్తి చేసిన చిత్రబృందం హైదరాబాద్‌కు చేరుకుంది. త్వరలో ఇక్కడ వేసిన సెట్లలో తదుపరి చిత్రీకరణ జరగనుంది.



# ఎంగేజ్‌మెంట్‌పై క్లారిటీ ఇచ్చిన బెల్లంకొండ

నటుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తనకు కాబోయే జీవిత భాగస్వామి కావ్యను అభిమానులకు పరిచయం చేశారు. సోషల్ మీడియాలో ఆమెతో ఉన్న ఫొటోను పంచుకుంటూ తమ బంధంపై స్పందించారు. ఆదివారం జరిగిన కార్యక్రమం నిశ్చితార్థం కాదని, కుటుంబ సభ్యుల మధ్య జరిగిన చిన్న వేడుక మాత్రమేనని వెల్లడించారు. త్వరలోనే అధికారికంగా తేదీలను ప్రకటిస్తానని తెలిపారు. కావ్య తన జీవితంలోకి రావడం ఆనందంగా ఉందని, ఆమె తన జీవితాన్ని సంతోషం, పాజిటివిటీతో నింపిందని పేర్కొన్నారు. జీవితాంతం ఆమె ముఖంపై చిరునవ్వు నిలిచేలా చూసుకుంటానని సోషల్ మీడియా పోస్టులో తెలిపారు. ఆదివారం జరిగిన కార్యక్రమానికి దర్శకుడు బోయపాటి శ్రీను, నటి సంయుక్తతో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. హైదరాబాద్‌కు చెందిన కావ్య ప్రముఖ న్యాయవాది కుమార్తెగా తెలిసింది. ప్రస్తుతం బెల్లంకొండ సాయి శ్రీనివాస్ 'హైందవ', 'టైసన్ నాయుడు' చిత్రాల్లో నటిస్తున్నారు.



# బన్నీతో నటించడం నా కల: రితికా నాయక్



టాలీవుడ్ యువ నటి రితికా నాయక్ తక్కువ సినిమాలతోనే మంచి గుర్తింపు పొందింది. 'అశోకవనంలో అర్జున కళ్యాణం' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఆమె, తాజాగా 'మిరాయ్' విజయంతో మరింత క్రేజ్ సంపాదించింది. ప్రస్తుతం వరుణ్ తేజ్ హీరోగా రూపొందుతున్న 'కొరియన్ కనకరాజు' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన రితికా నాయక్, అల్లు అర్జున్‌తో కలిసి నటించడం తన పెద్ద కల అని చెప్పింది. ఆయన సినిమాలో అవకాశం వస్తే చిన్న పాత్ర అయినా చేయడానికి సిద్ధంగా ఉంటానని తెలిపింది. అల్లు అర్జున్ ఎనర్జీ, డ్యాన్స్ అంటే తనకు చాలా ఇష్టమని పేర్కొంది. రితికా చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.






# మెరిసిన అనన్య పాండే స్టైలిష్ లుక్

యువ నటి అనన్య పాండే తన ఫ్యాషన్ స్టైల్‌తో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించారు. న్యూస్ 18షో షా రీల్ అవార్డ్స్ 2026 కార్యక్రమంలో పాల్గొన్న ఆమె రెడ్ కార్పెట్‌పై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ వేడుకలో 'కేసరి చాప్టర్ 2' సినిమాలో నటనకు గాను ఆమెకు అవుట్‌స్టాండింగ్ పెర్ఫార్మెన్స్ అవార్డు లభించింది. ఈ కార్యక్రమానికి అనన్య పాండే షాంపేన్ కలర్ డ్రేప్డ్ సారీ గౌన్‌లో హాజరయ్యారు. ఆధునిక డిజైన్‌తో రూపొందించిన ఈ దుస్తుల్లో నాజూకైన ఎంబ్రాయిడరీ, స్వల్ప మెరుపు అలంకరణలు ప్రత్యేకంగా కనిపించాయి. కోర్సెట్ స్టైల్ బ్లౌజ్ స్ట్రక్చర్డ్ డిజైన్, స్వీట్‌హార్ట్ నెక్‌లైన్‌తో ఆమె లుక్‌కు బోల్డ్ టచ్ ఇచ్చింది. సారీ ఒక వైపు కేప్ స్లీవ్‌లా స్టైల్ చేయడం వల్ల దుస్తులకు మరింత ప్రత్యేకత వచ్చింది. క్లాసిక్ ఎలిగెన్స్‌తో పాటు గ్లామర్‌ను కలిపిన ఈ లుక్ ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటోంది. రెడ్ కార్పెట్‌పై అనన్య పాండే స్టైలిష్ ప్రదర్శన కార్యక్రమానికి మరింత ఆకర్షణగా మారింది.

# కమర్షియల్ మూవీలో పీపుల్స్ స్టార్

సామాజిక అంశాలపై సినిమాలు చేస్తూ గుర్తింపు పొందిన పీపుల్స్ స్టార్ ఆర్ నారాయణమూర్తి తాజాగా ఒక కమర్షియల్ సినిమాలో నటించనున్నట్టు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 2018లో వచ్చిన 'హుషారు' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతున్న 'హుషారు 2'లో ఆయన ప్రత్యేక పాత్రలో కనిపించనున్నట్టు సమాచారం. ఈ సినిమాలో నక్సలైట్ పాత్రకు ఆర్ నారాయణమూర్తి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. తన భావజాలానికి దగ్గరగా ఉండే పాత్ర కావడంతోనే అంగీకరించినట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం 'హుషారు 2' చిత్రీకరణ పనులు కొనసాగుతున్నాయి.





# 'ధురంధర్ 2' అడ్వాన్స్ బుకింగ్ రికార్డులు

రణ్‌వీర్ సింగ్ హీరోగా ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన 'ధురంధర్' సినిమా అనూహ్య విజయాన్ని సాధించింది. ఇతర భాషల్లో డబ్బింగ్ చేయకుండానే విడుదలైన ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా రూ.1300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి రికార్డులు సృష్టించింది. సినిమా చివర్లో 'ధురంధర్ 2'ను ప్రకటించడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది.మొదటి భాగం విజయం తర్వాత రెండో భాగానికి సంబంధించిన పనులను దర్శకుడు ఆదిత్య ధర్ ముందుగానే పూర్తి చేసినట్టు సమాచారం. భారీ ప్రచారాలకు దూరంగా ఉండి అనుకున్న సమయానికి ట్రైలర్ విడుదల చేసి సినిమాను రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేశారు.ఇక 'ధురంధర్ 2' అడ్వాన్స్ బుకింగ్స్‌లో దూసుకుపోతోంది. విడుదలకు ముందే పెయిడ్ ప్రీమియర్స్‌కు మంచి స్పందన లభించింది. ఇప్పటివరకు రెండు లక్షలకు పైగా టికెట్లు అమ్ముడవగా, అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా సుమారు రూ.18 కోట్లకు పైగా వసూళ్లు వచ్చినట్టు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో సినిమా విడుదల తర్వాత భారీ కలెక్షన్లు నమోదు చేసే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

# పెద్ది కి కళ్లు చెదిరే బిజినెస్

రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' సినిమా విడుదలకు ముందే భారీ బిజినెస్ సాధిస్తున్నట్టు ట్రేడ్ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రానికి ఇప్పటికే విడుదలైన రెండు పాటలు, టీజర్ మంచి స్పందన తెచ్చుకోవడంతో ట్రైలర్ రాకముందే ప్యాన్ ఇండియా స్థాయిలో బజ్ పెరిగింది. ట్రేడ్ సమాచారం ప్రకారం ఈ సినిమా థియేటర్ బిజినెస్ దాదాపు రూ.300 కోట్ల వరకు చేరే అవకాశముందని చెబుతున్నారు. నైజాం హక్కులు సుమారు రూ.65 కోట్ల వరకు పలుకుతాయని, కర్ణాటక రూ.23 కోట్లు, ఓవర్సీస్ రూ.40 కోట్లకు ఒప్పందాలు జరిగినట్టు టాక్. సీడెడ్, కోస్తా ఆంధ్ర ప్రాంతాల్లో కూడా భారీ రేట్లు వినిపిస్తున్నాయి. ఇంకా హిందీ మార్కెట్ డీల్స్ ప్రారంభం కాలేదు. అక్కడ కూడా సినిమాపై మంచి డిమాండ్ ఉందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా ట్రైలర్ విడుదల చేసే అవకాశం ఉందని సమాచారం. విడుదల తేదీ మాత్రం మార్చే ఆలోచన లేదని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com